RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్గిరి సంపుటి : 2 సంచిక : 23 శుక్రవారం, ఫిబ్రవరి 16, 2024 పేజీలు : 4

### రెండో రోజూ భారీగా డీఎస్పీల బదిలీలు.. 26 మందిని ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఉత్తర్వులు

తెలంగాణలో ఉద్యోగుల బదిలీలు కొనసాగుతున్నాయి. ఇప్పటికే రెవెన్యూ, ఆబ్కారీ, పంచాయతీరాజ్ శాఖలో పెద్ద ఎత్తున అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. తాజాగా పోలీసు శాఖలో భారీగా బదిలీలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 95 మంది డీఎస్పీలను బుధవారం నాడు బదిలీ చేయగా.. తాజాగా మరో 26 మంది డీఎస్పీలను బదిలీ చేసింది. ఈ మేరకు గురువారం నాడు హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

# 70 రోజుల్లో... 25 వేల ఉద్యోగాలు



హైదరాబాద్ : కొత్తగా ఎంపికైన గురుకుల ఉపాధ్యాయులకు ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై సీఎం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ నియామకాలను చేపట్టకుండా బీఆర్ఎస్ ఎంతో నిర్లక్ష్యం చేసిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగ నియామకాలపై దృష్టి సారించిందని సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. గురుకుల ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ కుటుంబంలో ఉద్యోగాలు ఊడగొట్టినందుకే ఇప్పుడు నిరుద్యోగులకు మంచి రోజులు వచ్చాయి. ఉద్యోగాలు లభిస్తున్నాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గత ప్రభుత్వ అన్యాయాలను రాష్ట్ర ప్రజలు గమనించారనీ.. అందుకే కేసీఆర్ సర్కార్‌ను గద్దె దించారని చెప్పారు. ఉద్యోగ నియామకాలను పట్టించుకోని కేసీఆర్ సర్కార్.. కేవలం దోచుకోవడం.. దాచుకోవడంపైనే దృష్టి పెట్టారంటూ ఆరోపణలు చేశారు. అవినీతికి పాల్పడబట్టే మేడిగడ్డ బ్యారేజ్ పేకమేడలా కూలిపోయే పరిస్థితి దాపురించిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. సాగునీటి ప్రాజెక్టులపై లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసి.. లక్ష ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని అన్నారు. ప్రాజెక్టులపై చర్చ పెడితే అసెంబ్లీకి రాకుండా పారిపోయారని సీఎం రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. ఉద్యోగ నియామకాల చిక్కుముడులను విప్పుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. త్వరలోనే గ్రూప్-1 పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు. అధికారం చేపట్టిన 70 రోజుల్లోనే దాదాపు 25వేల ఉద్యోగ నియామకాలను చేపట్టామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం విద్య రంగం కోసం ఖర్చు చేసింది ఆరు శాతమే అనీ.. తాము ఇప్పుడు 12 శాతానికి పెంచామన్నారు. గురుకులాలను బలోపేతం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. అసెంబ్లీకి రావడానికి కేసీఆర్‌కు కాళ్ల నొప్పులొస్తాయని ఎద్దేవా చేశారు. నల్గొండకు వెళ్లడానికి మాత్రం ఎలాంటి నొప్పులు ఉండవని మండిప?డ్డారు. హరీశ్‌కు అధికారం రావాలంటే ఔరంగజేబు అవతారమెత్తాల్సిందేనని అన్నారు. పదేళ్లు చేసిందేమీ లేదు.. మేము రాగానే అక్కసు వెళ్లగక్కుతున్నారు. మా ప్రభుత్వం పేదల కోసం పని చేస్తుంటే.. మామా అల్లుళ్లు మమ్మల్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతున్నారు. నువ్వు రాజీనామా చెయ్ నేను చేసి చూపిస్తా అని హరీశ్ అంటుండు. హరీశ్‌రావును చూస్తుంటే.. మరో ఔరంగజేబులా కనిపిస్తున్నారు. అధికారం కోసం సొంత వాళ్లపైనే కర్కశంగా ప్రవర్తించిన చరిత్ర ఔరంగజేబుది. పదేళ్లు మంత్రిగా ఉండి హరీశ్ ఏం చేశారు?. మేడిగడ్డపై చర్చకు అసెంబ్లీకి రమ్మంటే రాకుండా పారిపోయింద్రు. దశ బాగుంటే దిశతో పని లేదు. ప్రజలకు ఏం ద్రోహం చేశారో ఇప్పటికైనా కేసీఆర్ తెలుసుకోవాలి అని. సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.



## మాది వాస్తవిక బడ్జెట్ : డిప్యూటీ సీఎం భట్టి

హైదరాబాద్ : బడ్జెట్‌లో కేటాయించిన ప్రతి రూపాయిలో సమానత్వం పాటించామన్నారు భట్టి... తెలంగాణలో ఆర్థిక, సామాజిక అసమానతలు ఉన్నాయని, అసమానతలను రూపుమాపేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు .తెలంగాణ బడ్జెట్‌పై అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. సభ్యుల సందేహాలను నివృత్తి చేశారు. గత ప్రభుత్వం రాబడులను అంచనా వేయకుండా బడ్జెట్ రూపొందించిందని



ఆరోపించారు. తమ ప్రభుత్వం చాలా సహేతుకంగా బడ్జెట్ రూపొందించామని చెప్పారు. గతంలో ఆదాయం ఉన్నా, లేకున్నా బడ్జెట్‌ను పెంచుకుంటూ వెళ్లారని, గత పదేళ్లలో సరైన బడ్జెట్‌ను రూపొందించలేదని అన్నారు. ప్రతి ఏడాది ఒక్కో అంశంపై 20 శాతం కేటాయింపులు పెంచుతూ వెళ్లారని అన్నారాయన. తెలంగాణ రాష్ట్రంలో సమాన అభివృద్ధికి తమ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు భట్టి విక్రమార్క... దళిత బంధు ఇవ్వడానికి తమ ప్రభుత్వానికి ఏమాత్రం అభ్యంతరం లేదని, కాంగ్రెస్ పార్టీ కూడా దళితుల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తోందన్నారాయన.. జాబ్ క్యాలెండర్ విడదల చేస్తామన్నారు భట్టి.. ధరణిలో అనేక లోపాలు ఉన్నాయని, ధరణి వెబ్ సైట్ ను ప్రక్షాళన చేస్తామని, ఆ తరువాతే ధరణిలో ఏర్పడిన లోపాలను సరిదిద్ది.. రైతులకు న్యాయం చేస్తామన్నారు ఉప ముఖ్యమంత్రి భట్టి.

## బీఆర్ఎస్‌కు ఝలక్..

### కాంగ్రెస్‌లోకి కీలక నేతలు..!

హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల తరువాత తెలంగాణ రాజకీయ పరిణామాలు చాలా వేగంగా మారిపోతున్నాయి. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోవడం.. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో పొలిటికల్ సర్కిల్‌లో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మొన్నటి వరకు బీఆర్ఎస్‌లో కీలక నేతలుగా చెలామణి అయిన వారు.. ఇప్పుడు కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే పలువురు నేతలు బీఆర్ఎస్ పార్టీని వీడి.. కాంగ్రెస్‌లో చేరగా.. ఇప్పుడు మరికొందరు నేతలు ఆ దిశగా అడుగులు వేస్తున్నారు. తెలంగాణ ఏర్పాటు తరువాత హైదరాబాద్ నగర మొదటి మేయర్‌గా పని చేసిన బొంతు రామ్మోహన్.. బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. రెండు రోజుల క్రితమే సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఆయన.. శుక్రవారం నాడు అంటే ఫిబ్రవరి 16వ తేదీన కాంగ్రెస్‌లో అధికారికంగా చేరనున్నారు. జీహెచ్ఎంసీ ప్రస్తుత డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత కూడా కాంగ్రెస్‌లో చేరనున్నారు. వీరితో పాటు.. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణా రెడ్డి, మాజీ మంత్రి మహేందర్ రెడ్డి, వికారాబాద్ జెడ్పీ చైర్ పర్సన్ సునీతా మహేందర్ రెడ్డి, రంగారెడ్డి జెడ్పీ చైర్ పర్సన్ అనితా రెడ్డి, మరికొందరు నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరనున్నారు. గాంధీ భవన్‌లో పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో వీరంతా కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోనున్నారు.

### మహిళా సంక్షేమమే...

## ప్రభుత్వ ధ్యేయం

మెదక్ : మహిళల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. జిల్లా కేంద్రం జిల్లా కలెక్టర్ రాజర్షి షా, మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ రోహిత్ రావులతో కలిసి మెదక్ జిల్లా కేంద్రంలో రూ.2 కోట్లతో నూతనంగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని "షీ" టీమ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. టీజింగ్‌కు గురైన మహిళలు, అమ్మాయిలు, పిల్లలు లైంగిక వేధింపులకు గురైన అమ్మాయిలకు, మహిళలకు, అత్తింటివారి ఆగడల బారిన పడిన మహిళలు, గృహహింసకు గురైన మహిళల కోసం భరోసా కేంద్రంలో మహిళ రక్షణ కల్పిస్తూ రాత్రి నిద్రించేందుకు వసతి కోసం ఈ కేంద్రం పని చేస్తుందని తెలిపారు. కౌన్సిలింగ్ కోసం, న్యాయ సహాయం కోసం, అవసరమైన వైద్య సదుపాయాలను కల్పించడం కోసం ఆధునిక హంగులతో నూతన భవనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు.



## పంజాబ్‌లో రైలురోకో

చండీగఢ్ : తమ డిమాండ్ల సాధనకు రైతులు ఓ వైపు కేంద్ర మంత్రుల బృందంతో చర్చలు జరుపుతూనే మరో వైపు తమ ఢిల్లీచలోను పట్టువీడకుండా సాగిస్తున్నారు. దీనితో వరుసగా మూడోరోజు కూడా పంజాబ్ , హర్యానా సరిహద్దులు, ఢిల్లీ శివార్లలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకూ రెండు దఫాలుగా సాగిన చర్చలు పురోగతి సాధించలేదు. దీనితో పంజాబ్, హర్యానా మధ్య సరిహద్దు ప్రాంతాలైన శంభూ, కనౌరి వద్ద రైతులకు, పోలీసు, పారామిలిటరీ బలగాల నడుమ ప్రతిష్టంభన నెలకొంది. పంజాబ్‌లో రైతుల ఉద్యమం మరో మలుపు తిరిగింది. రాష్ట్రవ్యాప్తంగా రైతు సంఘాలు, ఇతర సంస్థల పిలుపుతో రైలురోకో కార్యక్రమం సాగింది. చర్చల ఫలితం తేలేదాకా ఢిల్లీ వైపు సాగకుండా సరిహద్దులలో ఉంటామని రైతుల ఉద్యమనిర్వాహకులు తెలిపారు. అయితే భారతీకిసాన్ యూనియన్ , బికెయు దకౌండ ఆధ్వర్యంలో రైలురోకో సాగింది. కొన్నిచోట్ల రైతులు రైలు పట్టాలపై పడుకుని రైళ్లు నిలిపివేశారు.

## మాకు కొత్త కాదు కొట్లాట..

### కెటిఆర్ ఇంట్రెస్టింగ్ ట్వీట్



హైదరాబాద్ : బిఆర్ఎస్‌కు కొట్లాట కొత్త కాదంటూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ గురువారం ట్వీట్ చేశారు. బుధవారం అసెంబ్లీ మీడియా పాయింట్ దగ్గరకు వెళ్లకుండా అడ్డుకున్నందుకు నిరసన తెలిపిన ఫొటోలతో పాటు ఉద్యమం నాటి ఫొటోలను తన ట్విట్టర్‌లో కెటిఆర్ పంచుకున్నారు. గతంలో ఇదే రోడ్లపై ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యమం చేసి రాష్ట్రాన్ని సాధించుకున్న చరిత్ర బిఆర్ఎస్ పార్టీకి ఉందన్నారు. మళ్లీ ఉద్యమం నాటి రోజులు గుర్తొచ్చాయని కెటిఆర్ అన్నారు.

## టిఎంసికి షాక్...

### ఎంపీ పదవికి మిమీ చక్రవర్తి రాజీనామా



కోల్‌కతా : సార్వత్రిక ఎన్నికల ముందు పశ్చిమబెంగాల్ లో అధికార తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వానికి షాక్ తగిలింది. నటి, టిఎంసీ నేత మిమి చక్రవర్తి తన లోక్‌సభ ఎంపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా రాజకీయాలు నా కప్పు టీకాదు అని వ్యాఖ్యానించారు. జాదవ్‌పూర్ నుంచి మొదటిసారి ఎంపీ అయిన మిమీ చక్రవర్తి గురువారం మధ్యాహ్నం రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కలుసుకున్నారు. "ఈరోజు నేను మా పార్టీ సుప్రీంను కలుసుకున్నాను. ఈనెల 13నే నా రాజీనామాను ఆమెకు సమర్పించాను. ఇన్ని సంవత్సరాలు నాకు అర్థమైనదేమంటే రాజకీయాలు నా కప్పు టీకాదు" అని విలేఖరులకు ఆమె చెప్పారు. నిబంధనల ప్రకారం స్పీకర్‌కు ఇవ్వకుండా ముఖ్యమంత్రికి ఎందుకు సమర్పించారు? అని ప్రశ్నించగా, టిఎంసి నుంచి ఒకసారి అంగీకారం లభిస్తే , స్పీకర్‌కు రాజీనామా సమర్పిస్తాను " అని ఆమె పేర్కొన్నారు.

## అసెంబ్లీలో సెల్‌ఫోన్లు, వీడియోలు ప్రదర్శించరాదు

హైదరాబాద్: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఆరవ రోజుకు చేరుకున్నాయి. చైర్ అనుమతి లేకుండా శాసనసభలో మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల వీడియోలు పదర్శించరాదని స్పీకర్ గడ్డం ప్రసాద్ రూలింగ్ ఇచ్చారు. గురువారం శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగానే స్పీకర్ పలు అంశాలపై కీలక ప్రకటన చేశారు. అసెంబ్లీ నడుస్తుండగా మీడియా పాయింట్ వద్ద సభ్యులు మాట్లాడవద్దన్నారు. బ్రేక్ టైం లేదా సభ వాయిదా తరువాతే సభ్యులు మీడియా పాయింట్ వద్ద మాట్లాడాల న్నారు. శాసనసభలో భారతీయ జనతాపార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఏలేటి మహేశ్వర రెడ్డిని ప్రకటించారు. అనంతరం ప్రభుత్వం శాసనసభలో కాగ్ నివేదికను ప్రవేశపెట్టింది. అందులో నీటిపారుదల శాఖకు సబంధించి కాళేశ్వరం ప్రాజెక్టు, పంచాయతీరాజ్ ,రెవెన్యూ ,ఫైనాన్స్ రిపోర్టులను టేబుల్ చేసింది.



## సంపాదకీయం

# విదేశాంగ విధానం వివేకమైనదేనా?

నేడు యుద్ధ భయ పరిస్థితుల మధ్య ప్రపంచ ప్రజలు జీవిస్తున్నారు. అమెరికా -రష్యాల మధ్య ప్రపంచ ఆధిపత్య పోరాటం, అందులో భాగంగా ఉత్పన్నమైన ఉక్రెయిన్ - రష్యా యుద్ధం, అందులో అమెరికా జోక్యం, ఉత్తర- దక్షిణ కొరియాల మధ్య యుద్ధ వాతావరణం, అందుకు కారమైన అమెరికా విధానం, తైవాన్ స్వతంత్ర దేశమంటూ చైనాకి వ్యతిరేకంగా రెచ్చగొడుతున్న అమెరికా, పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి, అందుకు అమెరికా మద్దతు, ఇరాన్ పై అమెరికా బెదిరింపులు, చైనా- అమెరికాల మధ్య వైరం, భారత్- చైనాల మధ్య సరిహద్దుల వివాదం, సైనిక ఘర్షణలు, భారత్- పాకిస్తాన్ల మధ్య యుద్ధ వాతావరణ పరిస్థితులు ప్రజల భయానికి కారణాలుగా ఉన్నాయి. సోవియట్ యూనియన్ పతనం తర్వాత అమెరికా ప్రపంచ అగ్రరాజ్యంగా కొనసాగుతూ వచ్చింది. పుతిన్ రష్యా అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఆర్థిక సంక్షోభం నుండి బయటపడి అమెరికాతో పోటీకి దిగి బ్రెజ్నవ్ కాలం నాటి ఒక అగ్రరాజ్యగా మారి అమెరికాతో అనేక విషయాల్లో పోటీపడటం ప్రారంభించింది. ఉక్రెయిన్, రష్యా యుద్ధం అగ్రరాజ్యాల ఆధిపత్య పోరులో భాగమే. అంతేకాకుండా ఈ యుద్ధం పెట్టుబడిదారీ దేశాల మధ్య వైరుధ్యాలను కూడా పెంచింది. మరోసారి ప్రపంచాన్ని యుద్ధ జ్వాలల భయానికి గురి చేస్తున్నది. అగ్రరాజ్యాల ఆధిపత్య పోరులో భారత దేశం ఎలాంటి పాత్ర పోషిస్తున్నది, అది దేశ ప్రయోజనాలను కాపాడుతుందా, ప్రమాదంలోకి నెడుతుందా అన్నది ప్రజలకు అవగాహన అవసరం. 1947 ఆగస్టులో అధికార మార్పిడి జరిగిన తర్వాత భారత్ తొలి ప్రధానిగా జవహర్ లాల్ నెహ్రూ ప్రమాణ స్వీకారం చేశారు. బ్రిటన్ నాయకత్వాన వున్న కామన్వెల్త్‌లో సభ్యత్వం స్వీకరించి వలస పాలకుల ఎడల విశ్వాసం ప్రకటించారు. వలస పాలకుల విదేశాంగ విధానం స్థానంలో అలీన విధానాన్ని కొనసాగిస్తానని, తూర్పు- పశ్చిమం మధ్య సమాంతరంగా విదేశాంగ విధానం ఉంటుందని, పెట్టుబడిదారీ, సోషలిస్టు ఆర్థిక విధానాలు దేశంలో అమలు జరుపుతామని నెహ్రూ ప్రభుత్వం ప్రకటించింది. ఆ కాలంలో అమెరికా సామ్రాజ్యవాద, ఆధిపత్య విధానాలకు వ్యతిరేకంగా స్టాలిన్ నాయకత్వాన సోవియట్ యూనియన్ సోషలిస్టు ఆర్థిక విధానాలు విజయవంతంగా అమలు జరుపుతూ ఉండడం, చైనాలో మావో నాయకత్వాన విప్లవం విజయం అంచుకు చేరటం, అనేక దేశాల ప్రజలు మార్క్సిజం, సోషలిస్టు ఆర్థిక విధానాలకు ఆకర్షితులై తమ దేశాల్లో కూడా అలాంటి ఆర్థిక విధానాలు అమలు జరపాలని డిమాండ్ చేస్తూ ఉద్యమాలు ప్రారంభంచారు. భారత దేశం కూడా ఇందుకు మినహాయింపు కాదు. ఈ నేపథ్యం నుండి వచ్చిందే అలీన విధానం. నెహ్రూ సోషలిస్టు ఆర్థిక విధానాలను వ్యతిరేకించకపోవడానికి, సోవియట్ యూనియన్‌తో స్నేహంగా వుండడానికి అదే కారణంగా వున్నది. అలీన విధానం అంటేనే సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించక పోవడం, సోషలిస్ట్ ఆర్థిక విధానాలను పూర్తిగా సమర్థించకపోవడం. దేశ విభజన తర్వాత కశ్మీర్ ప్రధాన సమస్యగా దేశం ముందుకు వచ్చింది. ప్రత్యేక స్వతంత్ర ప్రతిపత్తి గల రాష్ట్రం కావాలనే డిమాండ్లతో కశ్మీర్ ప్రజల పోరాట నేపథ్యంలో భారత యూనియన్‌లో హిందూ రాజు కశ్మీర్‌ను విలీనం చేశాడు. విలీనం సందర్భంగా ప్రజాభిప్రాయ నిర్ణయం ద్వారా కశ్మీర్ సమస్య పరిష్కారం చేస్తామని నెహ్రూ ప్రభుత్వం ప్రకటించింది. భారత్ -పాకిస్తాన్ మధ్య కశ్మీర్ సమస్య తీవ్ర వివాదానికి దారితీసింది. ప్రజాభిప్రాయ సేకరణను భారత పాలకులు పక్కన పెట్టారు. పాకిస్తాన్ అత్యధికంగా అమెరికాపై ఆధారపడి దాని ఆధిపత్య ధోరణులకు మద్దతు ఇచ్చింది. 1954లో అమెరికా పాకిస్తాన్‌ను సెంట్రల్ ట్రీటీ ఆర్గనైజేషన్ (సెంట్) ఒప్పందంలో మిత్ర దేశంగా చేర్చుకుంది. పాకిస్తాన్‌ను ఎదుర్కోవడానికి సోవియట్ యూనియన్‌తో భారత్ ఒప్పందం చేసుకుంది. అమెరికా సామ్రాజ్యవాదం, ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న మార్క్సిజాన్ని చూసి తీవ్రంగా భయపడుతూ దాన్ని అడ్డుకోవడానికి నీచమైన విధానాలు అవలంబించింది. కమ్యూనిస్టు, సోషలిస్టు దేశాలుగా స్టాలిన్ నాయకత్వాన వున్న సోవియట్ యూనియన్, మావో నాయకత్వాన వున్న చైనాలపై ఇతర దేశాలను రెచ్చగొట్టి ఆ దేశాలతో సంబంధాలు విచ్ఛిన్నం చేయజూసింది. దాని వ్యూహంలో భాగంగా భారత చైనాల మధ్య ఏర్పడిన సరిహద్దు సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునే అవకాశం వున్నా అమెరికా దాన్ని అమలు కాకుండా చేసింది. చైనాపై నెహ్రూ ప్రభుత్వంలో శత్రుభావాన్ని సృష్టించి ఆయుధాలు సరఫరా చేస్తాను యుద్ధం చేయమని పరోక్షంగా ప్రేరేపించింది. దాని ఫలితమే 1962లో భారత -చైనా యుద్ధం. దాని పర్యవసానాలు అందరికీ తెలిసిందే. ఈ యుద్ధంలో భారత దేశాన్ని అమెరికా పూర్తిగా సమర్థించి ఆయుధాలు సరఫరా చేయగా, స్టాలిన్ మరణం తర్వాత రాజకీయ, ఆర్థిక విధానాల్లో మార్పు చెందిన సోవియట్ యూనియన్ తటస్థ వైఖరి అంటూనే పరోక్షంగా నెహ్రూ ప్రభుత్వాన్ని సమర్థించింది.

# ఘనంగా శామీర్ పేటలో ధర్మ బిక్షం జయంతి వేడుకలు

**శామీర్ పేట, (గరుడ వార్త) :** ధర్మబిక్షం ఎనలేని సేవలు మరువలేని తెలంగాణ రాష్ట్ర గీతా పనివాళ్ల సంఘం ప్రధాన కార్యదర్శి డీజీ సాయిలు గౌడ్ అన్నారు. గురువారం సాయంత్రం మండల కేంద్రం శామీర్ పేట మండల కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్మ బిక్షం చిత్రపటం ఏర్పాటు చేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1957 లో పుట్టిన గీత పనివాళ్ల సంఘం 75 సంవత్సరాలు నింపుకొని ప్రస్తుతం గీత కార్మికుల సమస్యల కోసం పోరాడుతున్న ఏకైక సంఘం అన్నారు. ధర్మ బిక్షం మూడుసార్లు ఎమ్మెల్యేగా, రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతూ ప్రజల మనిషిగా నిలిచారనీ, ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. రైతుల సమస్యలను, గీత కార్మికుల సమస్య లపై నిరంతరం పోరాడుతున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, వారి ఆశయాల అనుగుణంగా పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా మాజీ సహాయ కార్యదర్శి సి.హెచ్. దశరథ, అనుబంధ సంఘాల నాయకులు సహదేవ్, డి.జంగయ్య, టి.రాములు గౌడ్, నిమ్మల నరసింహ, నరేంద్ర చారి, డి. భూమయ్య, డి జి నరేందర్ ప్రసాద్, డి.జి ధర్మ రక్షక్, తదితరులు పాల్గొన్నారు.







## మేడారం సమ్మక్కసారలమ్మ ప్రసాదం ఇంటి వద్దకే చేరుస్తామంటున్న టిఎస్ ఆర్‌టిసి

**శామీర్ పేట, (గరుడ వార్త) :** మేడారం సమ్మక్క సారలమ్మ ప్రసాదం కోరుకున్న వారి ఇంటి వద్దకే చేర్చుతామని హాకీంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ భవభూతి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... మేడారం జాతరకు వెళ్లలేని భక్తులకు టి ఎస్ ఆర్ టి సి లాజిస్టిక్స్ ద్వారా సమ్మక్క సారలమ్మ ప్రసాదంతో పాటు పసుపు కుంకుమ కేవలం రూ. 299 రూపాయలకే ఇంటి వద్దకే ఇంటి వద్దకు అందజేయాలని ఉద్దేశంతో ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ కమిటీతో టి ఎస్ ఆర్ టి సి ఒప్పందం కుదుర్చుకున్నదనీ, ఈనెల 16వ తేదీ నుంచి 25 వరకు మీ దగ్గరలో ఉన్న ఆర్టీసీ లాజిస్టిక్ కేంద్రాలలో బుకింగ్ చేసుకోగలరనీ చెప్పారు. ఈ అవకాశాన్ని హాకీంపేట డిపో పరిధిలో ఉన్న భక్తులందరూ వినియోగించుకోవాల్సిందిగా డిపో మేనేజర్ భవభూతి కోరారు. మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్ రెడ్డి, గోపు శ్రీనివాస్ ఈ క్రింది ఫోన్ నెంబర్లలో 9959226144, 9154298832, 8008736888. సంప్రదించాలని డి ఎం తెలిపారు.

# కానిస్టేబుల్ కుటుంబానికి సిబ్బంది చేయూత

## - సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐపీఎస్, చేతుల విరీదుగా కుటుంబ సభ్యులకు ప్లాట్ డాక్యుమెంట్ అందజేత



**సైబరాబాద్ కమిషనరేట్ (గరుడ వార్త) :** ప్రాణాలు కోల్పోయిన తోటి కానిస్టేబుల్ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుకొచ్చిన పోలీస్ సిబ్బందిని అభినందించిన సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి. పర్మగల్ల యాదయ్య 2007లో (ఏఆర్) కానిస్టేబుల్ గా సెలెక్ట్ అయి సైబరాబాద్ లో విధులు నిర్వర్తించారు. అనంతరం 2011లో (సివిల్) కానిస్టేబుల్ గా సెలెక్ట్ అయి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ లోని వివిధ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించారు. ఈ క్రమంలో మాదాపూర్ పోలీస్ స్టేషన్లో సివిల్ కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తున్న యాదయ్య 08.08.2023 రోజున అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. యాదయ్యకు భార్య పూజ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా హఠాన్మరణం చెందిన తోటి సహోద్యోగి కుటుంబాన్ని ఆదుకోవాలని నిర్ణయానికి వచ్చిన మాదాపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, 2011 బ్యాచ్ కు చెందిన సిబ్బంది అనుకున్నదే తడవుగా సైబరాబాద్, రాచకొండ, కరీంనగర్ బ్యాచ్ మేట్లు అంతా కలిసి రూ. 15 లక్షల విరాళాలు సేకరించి ఆ కుటుంబానికి తమ వంతు ఆర్థిక భరోసా కల్పించారు. వారు సేకరించిన డబ్బుతో శంషాబాద్ దగ్గరలోని పెద్ద షాపూర్ లో యాదయ్య పిల్లల పేరు మీద 200 గజాల ప్లాట్ కొనడం జరిగింది. ఈ ప్లాట్ కు సంబంధించిన డాక్యుమెంట్ ను ఈరోజు సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ఐపీఎస్., చేతుల విరీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ డిసిపి డాక్టర్ జి. వినీత్, మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్, తదితరులు ఉన్నారు.

# చంద్రబాబు ఇంటికి వైసీపీ కీలక నేతలు

అమరావతి: ఏపీలో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటంతో తెలుగుదేశం పార్టీ చేరికలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. వైసీపీ నుంచి టీడీపీ లోకి భారీగా నేతలు చేరుతున్నారు. రాబోయే ఎన్నికల్లో అధికారం చేపట్టడమే లక్ష్యంగా టీడీపీ హై కమాండ్ పలు ప్రణాళికలు రచిస్తోంది. ప్లాన్‌లో భాగంగా టీడీపీ ఆపరేషన్ ఆకర్ష్ చేపట్టినట్లు సమాచారం. ఇందులో భాగంగా తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉండవల్లిలోని నివాసం వద్ద సందడి వాతావరణం నెలకొంది. ఆశావాహులు, పార్టీలో చేరికలకు వచ్చిన వారితో చంద్రబాబు నివాస ప్రాంతం కోలాహలంగా మారింది.



**టీడీపీలోకి ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు..?**

చంద్రబాబును ఉండవల్లిలోని నివాసంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు గురువారం కలిశారు. ఇటీవలే ఎంపీ పదవికి, వైసీపీ సభ్యత్వానికి ఆయన రాజీనామా చేసిన విషయం తెలిసిందే. త్వరలో తెలుగుదేశంలో శ్రీకృష్ణదేవరాయులు చేరనున్నట్లు సమాచారం. అయితే గత కొంత కాలంగా వైసీపీ అధిష్ఠానంపై ఎంపీ అసంతృప్తితో ఉన్నారు. కొద్దిరోజుల క్రితం తాడేపల్లిలోని సీఎం జగన్ కార్యాలయానికి ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు వెళ్లారు. అయితే ఆ సమయంలో ఎంపీపై జగన్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. అప్పటి నుంచి వైసీపీ హై కమాండ్‌తో అట్టిముట్టన్నట్లుగానే ఎంపీ ఉంటూ వస్తున్నారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో ఎంపీ పదవికి, వైసీపీ సభ్యత్వానికి ఆయన రాజీనామా చేశారు. అయితే వైసీపీకి రాజీనామా చేసిన తర్వాత అతను టీడీపీలోకి చేరడానికి మార్గం సుగమం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగానే చంద్రబాబును ఆయన కలిశారు. టీడీపీలో చేరితేనే తనకు రాజకీయ భవిష్యత్తు ఉంటుందని భావించిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు ఆ పార్టీలో చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఆయన పసుపు కండువా కప్పుకోనున్నట్లు సమాచారం.



**చంద్రబాబు ఇంటికి అట్లా చిన్న వెంకటరెడ్డి**

అలాగే.. నరసరావుపేట నుంచి చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరేందుకు వైసీపీ సీనియర్ నేత అట్లా చిన్న వెంకటరెడ్డి వచ్చారు. 100 కార్ల భారీ కాన్వాయ్‌తో చంద్రబాబు నివాసం వద్దకు ఆయన, అనుచరులు చేరుకున్నారు. వివిధ నియోజకవర్గాలకు చెందిన వైసీపీ నేతలు, కార్యకర్తలు కూడా పార్టీలో చేరనున్నారు. కాగా.. చంద్రబాబును టీడీపీ సీనియర్ నాయకులు గొట్టిపాటి రవి, ఏలూరు సాంబశివరావు, అనగాని సత్యప్రసాద్, ఉక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదిరెడ్డి వాసు, కందికుంట ప్రసాద్, భూమా అఖిల ప్రియ కలిశారు. నూజివీడు టీడీపీలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై టీడీపీ ఇన్‌చార్జి ముద్రబోయిన వెంకటేశ్వరరావును పిలిచి చంద్రబాబు మాట్లాడుతున్నారు. చింతలపూడి నియోజకవర్గాన్ని మాల సామాజిక వర్గానికి కేటాయించాలని టీడీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. రజకులను ఎస్సీల్లో చేర్చాలంటూ నరసరావుపేటకు చెందిన టీడీపీ రజక నాయకులు చంద్రబాబును కలిసేందుకు ఆయన నివాసం వద్దకు చేరుకున్నారు. ఆళ్లగడ్డ, కోవూరు, కదిరి, నరసరావు పేట, అద్దంకి సెగ్మెంట్ల నుంచి వైసీపీ నుంచి టీడీపీలోకి నేతలు భారీ ఎత్తున చేరనున్నారు.

# సీనియర్ సిటిజెన్స్‌కు బంపర్ ఆఫర్.......



సురక్షిత పెట్టుబడి పథకాలలో అత్యంత ప్రజాదరణ పొందినవి ఫిక్స్‌డ్ డిపాజిట్లు. వీటిల్లో కచ్చితమైన రాబడితో పాటు అధిక వడ్డీ వస్తుండటంతో అందరూ వీటిల్లో పెట్టుబడులు పెడుతున్నారు. అయితే ఈ పథకంలో వడ్డీ రేట్లు అన్ని చోట్ల ఒకే రకంగా ఉండవు. ఒక్కోచోట ఒక్కో రకమైన వడ్డీరేట్లు ఉంటాయి. కొన్ని బ్యాంకులు అధిక వడ్డీ రేట్లు ఇస్తున్నాయి. ముఖ్యంగా సీనియర్ సిటీజెన్స్ కు ఎక్కువ వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. ఈ క్రమంలో కొన్ని బ్యాంకులు తమ ఫిక్స్ డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను సవరించాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ), యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ), కర్ణాటక బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్, ఫెడరల్ బ్యాంక్‌లు వడ్డీ రేటును పెంచాయి. సీనియర్ సిటిజన్‌లు గరిష్టంగా వీటిని పొందవచ్చు 8.25 శాతం. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇవి.. 2024 జనవరి 15న రేట్ రివిజన్ తర్వాత బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 60 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు గరిష్టంగా 7.75 శాతం పొందవచ్చు. అంటే ఇది సీనియర్లకు కనీసం 50 బేసిస్ పాయింట్ల అదనపు రేట్లను అందిస్తుంది.

## ఈ బ్యాంకుల్లో భారీగా పెరిగిన ఎఫ్‌డీ వడ్డీ రేట్లు

ఒక సంవత్సరం నుంచి రెండు సంవత్సరాల కంటే తక్కువ వరకు, ఇది సీనియర్లకు 7.35 శాతం, రెండు సంవత్సరాల నుంచి మూడు సంవత్సరాల వరకు 7.75 శాతం, మూడు సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాల వరకు 7.15 శాతం అందిస్తుంది. ఐదు సంవత్సరాల నుంచి 10 సంవత్సరాల వరకు 7.50 శాతం, ప్రత్యేక 399 రోజుల పదవీకాలం లేదా బరోడా తిరంగా ప్లస్ డిపాజిట్ స్కీమ్లో అయితే 7.65 శాతం పొందవచ్చు. 2024, జనవరి 19న ఈ రేట్లను సవరించింది. సీనియర్ సిటిజన్‌లకు గరిష్టంగా 7.75 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్‌లకు (80 ఏళ్లు అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు) 8.00 శాతం ఆఫర్ చేస్తోంది. ఇది ఒక సంవత్సరానికి 7.25 శాతం, 398 రోజుల ఎఫ్డీలకు ఒక సంవత్సరం, 399 రోజులకు 7.75 శాతం, 400 రోజుల నుంచి 10 సంవత్సరాల వరకు అన్ని పదవీకాలాలకు 6.50 శాతం అందిస్తుంది. సీనియర్ సిటిజన్లకు అందుబాటులో ఉన్న రేట్ల కంటే సూపర్ సీనియర్లు 0.25 శాతం అదనంగా పొందుతారు. దీని ప్రకారం ఒక సంవత్సరం నుంచి 398 రోజులకు 7.50 శాతం, 399 రోజులకు 8.00 శాతం, 399 రోజుల నుంచి 10 సంవత్సరాల కంటే ఎక్కువ ఎఫ్డీలకు 6.75 శాతం లభిస్తోంది. ఈ బ్యాంకు ఈనెలలో రెండో సారి వడ్డీ రేటును సవరించింది. తాజా సవరణ తర్వాత, సీనియర్ సిటిజన్లకు అత్యధికంగా 7.75 శాతం అందిస్తుంది.

## పొదుపు చేయాలంటే వ్యూహం తప్పనిసరి....!





భారతదేశంలో ప్రజలను పెట్టుబడివైపు ప్రోత్సహించేలా వివిధ పెట్టుబడి పథకాలు అందుబాటులో ఉన్నాయి. ఏ పథకానికి ఆ పథకం ప్రత్యేక లక్షణాలతో ఉంటుంది. నెలవారీ ప్రీమియం చెల్లించే పథకాలతో పాటు ఒకేసారి వచ్చిన సొమ్మును పొదుపు చేసుకునేలా వివిధ పథకాలు ఎక్కువ ఆదరణ పొందాయి. వీటిల్లో జాతీయ పొదుపు ధ్రువీకరణ పత్రం విస్తృతంగా ప్రజలను ఆకట్టుకున్న పెట్టుబడి ఎంపికగా ఉంది. ఎన్ఎస్‌సీ అనేది స్థిర ఆదాయ పెట్టుబడి ప్రోగ్రామ్. ఇది హామీ ఇవ్వబడిన రాబడితో సురక్షితమైన, నమ్మదగిన ఎంపికను అందిస్తుంది. పన్ను ప్రయోజనాలు, ఆకర్షణీయమైన రాబడి రేట్ల కారణంగా మధ్యతరహా పెట్టుబడిదారులలో ప్రజాదరణ పొందింది. ఎన్ఎస్‌సిలు ఆర్థిక మంత్రిత్వ శాఖ నిర్ణయించిన కాలానుగుణ వడ్డీ రేటు సవరణలకు లోనవుతాయి. 2023-24 ఆర్థిక సంవత్సరం (జనవరి-మార్చి) నాలుగో త్రైమాసికంలో ప్రస్తుత ఎన్ఎస్‌సీ వడ్డీ రేటు సంవత్సరానికి 7.7 శాతంగా ఉంది. ఈ రేటు మునుపటి త్రైమాసికంతో (అక్టోబర్-డిసెంబర్ 2023) స్థిరంగా ఉంది. వడ్డీ ఏటా సమ్మేళనం చేస్తారు. అయితే ఈ పథకంలో పెట్టుబడి పెట్టడానికి ఎలాంటి ఎంపికలు అందుబాటులో ఉన్నాయో? ఓసారి తెలుసుకుందాం. ఎన్ఎస్‌సీలో పెట్టుబడి అనేది ఒక సాధారణ ప్రక్రియ. ఇది రెండు ప్రాథమిక మార్గాలను అందిస్తుంది. ఆఫ్‌లైన్ (ఫిజికల్ సర్టిఫికేట్), ఆన్‌లైన్ (ఈ-మోడ్) ద్వారా పెట్టుబడి పెట్టవచ్చు. ఈ నేపథ్యంలో ఆఫ్‌లైన్ పెట్టుబడి విధానం గురించి చూద్దాం. ఎన్ఎస్‌సీలు భారతదేశంలోని ఏదైనా పోస్టాఫీసు శాఖలో కొనుగోలు చేయడానికి అందుబాటులో ఉంటాయి. అక్కడ ఫారమ్‌ను తీసుకుని మీ వివరాలు, ప్రాధాన్య డిపాజిట్ మొత్తం, ఎంచుకున్న మెచ్యూరిటీ వ్యవధి (ప్రస్తుతం 5 సంవత్సరాలకు పరిమితం), నామినీ సమాచారాన్ని పూరించండి. మీ గుర్తింపు రుజువు పత్రాలైన ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, చిరునామా రుజువు పత్రాలైన ఆధార్ కార్డు, ఓటర్ ఐడీతో పాటు స్వీయ ధ్రువీకృత కాపీలను సమర్పించాలి. అనంతరనం మీరు నగదు రూపంలో లేదా చెక్కు ద్వారా చెల్లింపును పెట్టవచ్చు. ఈ పథకంలో కనీస పెట్టుబడి రూ. 100గా ఉంటే గరిష్ట పెట్టుబడికి మాత్రం పరిమితి లేదు. సంబంధిత అధికారులు మీకు ఫిజికల్ సర్టిఫికేట్‌ను రూపొందించి జారీ చేస్తారు. ఇది మీ పెట్టుబడికి సాక్ష్యంగా ఉపయోగపడుతుంది కాబట్టి దానిని సురక్షితంగా నిల్వ ఉంచుకోండి. ఆన్‌లైన్‌లో పెట్టుబడి ఇలా మీరు పోస్టాఫీసులో సేవింగ్స్ ఖాతాను కలిగి ఉంటే, ఇంటర్నెట్ బ్యాంకింగ్ యాక్సెస్ కలిగి ఉంటే మీరు ఎన్ఎస్‌సీలో ఆన్‌లైన్ పెట్టుబడులు పెట్టవచ్చు.

## ఈవీలపై టాటా మోటార్స్ భారీ డిస్కౌంట్...




విద్యుత్ కార్లపై టాటా మోటార్స్ భారీ డిస్కౌంట్‌ను ప్రకటించింది. నెక్సాన్, టియాగో, టిగోర్ మోడల్స్‌పై కంపెనీ 1.2 లక్షల రూపాయల వరకు తగ్గింపు ప్రకటించింది. బ్యాటరీ వ్యయం తగ్గడంతో డిస్కౌంట్ ఆఫర్ చేస్తున్నట్లు టాటా మోటార్స్ తెలిపింది. నెక్సాన్ ఈవీపై గరిష్టంగా 1.2 లక్షల రూపాయల తగ్గిస్తున్నట్లు తెలిపింది. దీంతో తగ్గింపుతో ఈ కారు 14.49 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. టియాగో ఈవీ 70 వేల వరకు డిస్కౌంట్ ప్రకటించింది. ఇకపై ఈ మోడల్ ధర 7.99 లక్షల నుంచి ప్రారంభం అవుతుందని కంపెనీ పేర్కొంది. పంచ్ ఈవీ ధరను మాత్రం కంపెనీ తగ్గించలేదు. విద్యుత్ కార్ల ధరలో ప్రధానంగా బ్యాటరీ ఖర్చు ఎక్కువగా ఉంటుందని టాటా మోటార్స్ తెలిపింది. ఇటీవల కాలంలో బ్యాటరీ సెల్స్ ధరలు తగ్గుముఖం పట్టాయి. భవిష్యత్‌లోనూ వీటి ధరలు తగ్గుతాయని అంచనా వేస్తున్నామని కంపెనీ తెలిపింది. ఈ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు బదిలీ చేయాలని నిర్ణయించామని టాటా మోటార్స్ ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ వివేక్ శ్రీవాస్తవ చెప్పారు. ఈవీ కార్లను మరింతగా ప్రజలకు చేరువ చేసేందుకు ఈ తగ్గింపు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన చెప్పారు. దేశీయంగా విద్యుత్ వాహనాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని టాటా మోటార్స్ పేర్కొంది. 2023లో ప్రయాణ వాహనాల విక్రయాల్లో 8 శాతం వృద్ధి నమోదు అయ్యాయి.

## అదాని కేసును పున:సమీక్షించాలి...!



ముంబయి : అదాని- హిండెన్ బర్గ్ కేసును పున:సమీక్షించాలనే డిమాండ్ వచ్చింది. ఈ కేసులో సిట్ దర్యాప్తును నిరాకరిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఇటీవల ఇచ్చిన తీర్పును సమీక్షించాలని మంగళవారం పిటిషన్ దాఖలయ్యింది. అసలు కేసులో పిటిషనర్లలో ఒకరైన అనామికా జైస్వాల్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. జనవరి 3న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించాలని కోరారు. ఈ కేసులో సుప్రీం ఇచ్చిన 46 పేజీల తీర్పులో సెబి నుండి దర్యాప్తును సిట్‌కు బదిలీ చేయడానికి ఎటువంటి కారణం లేదని పేర్కొంది.

## పన్ను ఆదా ప్రయోజనాన్ని ఇచ్చే ఫండ్స్!




ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచే పన్ను ఆదా పథకాల్లో ఇన్వెస్ట్‌మెంట్ ప్రారంభించడం మంచి ఆలోచన అవుతుంది. ఎందుకంటే ఆర్థిక సంవత్సరం ముగింపునకు వచ్చే సరికి ప్రణాళిక మేరకు పెట్టుబడులు సులభంగా పూర్తి చేసుకోవచ్చు. తద్వారా ఆశించిన మేర పన్ను ఆదాకు మార్గం సుగమం చేసుకోవచ్చు. అయితే, ప్రతి నెలా ప్రణాళికాబద్ధంగా ఇన్వెస్ట్ చేయడం కాకుండా, ఆర్థిక సంవత్సరం చివర్లో పన్ను ఆదా సాధనాల్లో ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేసే వారు కూడా పెద్ద సంఖ్యలోనే ఉంటారు. అలాంటి వారు ఈ తరుణంలో ఈక్విటీ పెట్టుబడులతోపాటు, పన్ను ఆదా ప్రయోజనాన్ని ఇచ్చే ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్‌ను పరిశీలించొచ్చు. ఈ విభాగంలో మంచి పనితీరు చూపిస్తున్న పథకాల్లో మిరే అస్సెట్ ట్యాక్స్ సేవర్ ఒకటి. మూడేళ్ల లాకిన్ ఉండే ఈ పథకంలో రూ. 1.5 లక్షల పెట్టుబడిపై సెక్షన్ 80సీ కింద పూర్తి పన్ను మినహాయింపులు సొంతం చేసుకోవచ్చు. ఈ పథకం 2015 డిసెంబర్‌లో ప్రారంభం కాగా, నాటి నుంచి నేటి వరకు ఏటా 18.73 శాతం చొప్పున పెట్టుబడులపై ప్రతిఫలాన్ని అందించింది. గడిచిన ఆరు నెలల కాలంలో రాబడులు 14.51 శాతంగా ఉన్నాయి. ఏడాది కాలంలో రాబడి 17.30 శాతంగా ఉంది. మూడేళ్లలో 18 శాతం, ఐదేళ్లలో 19.21 శాతం, ఏడేళ్లలో ఏటా 18.55 శాతం చొప్పున ఇన్వెస్టర్లకు రాబడులను తెచ్చి పెట్టింది. ఈ పథకం రాబడులకు ప్రామాణికంగా పరిగణించే బీఎస్ఈ 500 టీఆర్ఐ (టోటల్ రిటర్న్ ఆన్ ఇండెక్స్)తో పోలిస్తే ఐదు, ఏడేళ్ల కాలంలో ఈ పథకంలో రెండు శాతం అధిక రాబడులు ఉన్నాయి. ఈక్విటీ ఎల్ఎస్ఎస్ విభాగం కంటే కూడా ఇవే కాలాల్లో ఈ పథకమే మెరుగ్గా పనిచేసింది. ప్రస్తుతం ఈ పథకం నిర్వహణలో 20431 కోట్ల ఆస్తులు ఉన్నాయి. పెట్టుబడిపై ఇన్వెస్టర్ల నుంచి వసూలు చేసే ఎక్స్‌పెన్స్ రేషియో 1.58 శాతంగా ఉంది. 2017 నుంచి ఈక్విటీల్లో పూర్తి మొత్తంలో ఇన్వెస్ట్ చేస్తూ వస్తోంది. ప్రస్తుతం తన నిర్వహణలోని ఆస్తుల్లో 98.35 శాతం ఈక్విటీలకు కేటాయించింది. మిగిలిన 1.65 శాతం నగదు నిల్వల రూపంలో ఉంది. ఈక్విటీ పెట్టుబడుల్లోనూ 67 శాతం లార్జ్‌క్యాప్ కంపెనీల్లోనే ఉన్నాయి. మిడ్‌క్యాప్ కంపెనీలకు 25 శాతం కేటాయించగా, స్మాల్‌క్యాప్ కంపెనీల్లో 8.41 శాతం పెట్టుబడులు కలిగి ఉంది. పోర్ట్‌ఫోలియోలో మొత్తం 72 స్టాక్స్ ఉన్నాయి. పెట్టుబడుల పరంగా బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు పెద్ద పీట వేసింది. 30.50 శాతం మేర పెట్టుబడులు ఈ రంగానికి చెందిన కంపెనీలకే కేటాయించింది. మొదటి నుంచి ఈ పథకం బ్యాంకింగ్, ఫైనాన్షియల్ రంగ కంపెనీలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోంది.

## దేశమంతా సౌర వెలుగులు.......



న్యూఢిల్లీ: మధ్యంతర బడ్జెట్‌లో ప్రకటించిన రూఫ్‌టాప్ సోలార్ పథకాన్ని ప్రభుత్వం మంగళవారం అధికారికంగా ప్రారంభించింది. దీని పేరును పీఎం సూర్య ఘర్: ముఫ్త్? బిజిలీ' యోజనగా నిర్ణయించింది. ఇందుకోసం రూ. 75 వేల కోట్లు పెట్టుబడి పెడతారు. ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్?'లో ప్రకటించారు. ఈ పథకం వల్ల కోటి కుటుంబాలకు 300 యూనిట్ల ఉచిత కరెంట్?ను అందిస్తామని హామీ ఇచ్చారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉచిత కరెంట్?పై దృష్టి సారిస్తోంది. ఈ పథకాన్ని అట్టడుగు స్థాయిలో అమలు చేసేందుకు స్థానిక సంస్థలు, పంచాయతీలు తమ పరిధిలో రూఫ్‌టాప్ సోలార్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తారు. సూర్య ఘర్ వల్ల జనానికి ఆదాయం రావడమేగాక కరెంటు బిల్లు భారం తప్పుతుంది.

## ఆ ఎల్‌ఐసీ పాలసీతో లాభాల పంట.. ....

లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఇటీవల ఎల్‌ఐసీకు సంబంధించి ఇండెక్స్ ప్లస్ అనే కొత్త యూనిట్-లింక్డ్ జీవిత బీమా పాలసీని ప్రారంభించింది . ఇది నాన్-పార్టిసిపేటింగ్, రెగ్యులర్ ప్రీమియం, వ్యక్తిగత జీవిత బీమా ప్లాన్ అని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇది పాలసీ కాల వ్యవధిలో జీవిత బీమా కవరేజ్‌తో పాటు పొదుపులను కూడా అందిస్తుంది. ఎల్‌ఐసీ ఇండెక్స్ ప్లస్ పాలసీ వ్యవధి అంతటా జీవిత బీమా వర్తిస్తుంది. ఎల్‌ఐసీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న పాలసీ బ్రోచర్ ప్రకారం నిర్దేశిత పాలసీ వ్యవధి ముగింపులో వార్షిక ప్రీమియం శాతంగా హామీ ఇచ్చిన జోడింపులు యూనిట్ ఫండ్‌కు జోడిస్తారు. అలాగే యూనిట్లను కొనుగోలు చేయడానికి ఉపయోగిస్తారు. ఈ నేపథ్యంలో ఎల్‌ఐసీ ఇండెక్స్ పాలసీ తీసుకునే సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. మెచ్యూరిటీ తేదీకి ముందు (గ్రేస్ పీరియడ్‌తో సహా) జీవిత బీమా పొందిన వ్యక్తి మరణించినప్పుడు అందించిన పాలసీ అమలులో ఉంటుంది.



# మన చరిత్ర అదేనా.....?



పేరులో కులాన్ని సూచించటం మనకు కొత్తకాదు. రెడ్డి, నాయుడు, శాస్త్రి, శర్మ, త్రివేది, ద్వివేది, నాడార్, రాజ్‌పుత్, మోదీ, జోషి.. ఇలా ఎన్నో కుల సూచికలు మన పేర్ల వెనుక కనపడతాయి. ఇలాంటి సూచికలను పెట్టుకోవటం నామోషీగా భావించే వారి సంఖ్య చాలా తక్కువ. పిలుపులో సౌలభ్యం కోసం వ్యక్తుల పేర్లు పొట్టివి అవుతున్నాయి. అంతవేరకు కుల సూచికలు తొలగిపోతున్నాయి. ఆధునిక భావాల ప్రభావంతో కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు కుల ప్రస్తావనలు లేని పేర్లను పెడుతున్నారు. సౌలభ్యం సంగతి ఎలా ఉన్నా కుల సూచికలతో ఇబ్బంది పడని వారి సంఖ్యే మనకు ఎక్కువ. ఎందుకంటే ఆ సూచికలు ఒక స్థాయిని, హోదాని వెల్లడిస్తాయి. అగ్రకులాల విషయంలో ఇది స్పష్టంగా కనపడుతుంది. దళితులకు ఈ వెసులుబాటు చాలా చోట్ల లేదు. ముఖ్యంగా తెలుగునాట ఇది కొట్టొచ్చినట్లు కనపడుతుంది. మాల, మాదిగ, ఎరుక, దొమ్మరి.. అనే పేర్లు వింటేనే తిరస్కారాన్ని, ఏహ్యతను, చిన్నచూపుని ప్రదర్శించే సంస్కృతి నిన్నమొన్నటి వరకూ అందరిలో పాతుకుపోయింది. దీన్ని నిరసిస్తూ ఒక ధిక్కార స్వరంతో తమ పేర్ల వెనుక మాల, మాదిగ అని పెట్టుకోవటం మామూలు విషయం కాదు. కులాల పేర్లను నిర్భీతిగా అసలు పేర్ల వెనుక తగిలించుకుని సముచిత గౌరవం, హక్కుల కోసం ప్రయత్నించటం 1990ల తర్వాత బాగా పెరిగింది. సామాజిక మార్పును విభిన్న రీతిలో కోరుకోవటంగా దీన్ని పరిగణించొచ్చు. అంబేద్కర్ రాజకీయాల ప్రభావంతో మొదలైన ఈ ధోరణి సామాజిక న్యాయ అందోళనల్లో కొత్త ఒరవడిని సృష్టించింది. మన చరిత్రలో దీనికి పూర్తిగా భిన్నమైన పరిణామం ఇంకోటి ఉంది. అది సుదీర్ఘకాలం జరిగింది. ఇంకా జరుగుతూనే ఉంది. సంప్రదాయ కులాల పేర్లలోనే తమను చిన్నచూపు చూసే పరిస్థితి ఉందని భావించిన వారు ఆ పేర్ల మార్పు కోసం చాలా ప్రయత్నాలు చేశారు. ప్రభుత్వాలకు వినతిపత్రాలు, మహజర్లు సమర్పించారు. బ్రిటిషు పాలనలో అది విస్తృతంగా జరిగింది. ఆనాటి జనాభా లెక్కల సమయంలో అదొక ఉద్యమంలా సాగింది. గ్రామాల్లో వాడుకలో ఉన్న కులాల పేర్ల స్థానంలో సంస్కృత పదాలతో కూడిన కొత్త పేర్లు వచ్చాయి. గొల్ల, మంగలి, చాకలి లాంటి పేర్ల స్థానాన్ని యాదవ, నాయిబ్రాహ్మణ, రజక లాంటి పేర్లు ఆక్రమించాయి. ఇలా పేర్ల మార్పుతో మొదలై అగ్రకులాల అలవాట్లు, పద్ధతుల వైపు పరుగులెత్తటం, అందుకోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన సంఘటనలు మన చరిత్రలో చాలా కనిపిస్తాయి. అదొక సుదీర్ఘ ప్రయాణం. దేశంలో ఏదో ఒకచోట నిరంతరం సాగుతూనే ఉండేది. దీన్ని ఎలా చూడాలి? దాని ప్రాధాన్యతను ఎలా అర్థంచేసుకోవాలి? దాన్ని వివరించటానికి ఉపకరించే భావనను ఏమని పిలుచుకోవచ్చు? ఈ ప్రశ్నలను ఎంతో కొంత సమగ్రంగా అర్థంచేసుకోటానికి తోడ్పడిన పరిశోధనను చేసిన వారిలో సోషల్ ఆంత్రపాలజిస్ట్ ఎం.ఎన్.శ్రీనివాస్‌ను ప్రముఖుడిగా భావించొచ్చు. సామాజికంగా కింది స్థాయిలో ఉన్న కులాలు పైకి ఎదగటానికి చేసే ప్రయత్నాలకు ఆయన సాంస్కృటైజేషన్ (సంస్కృతీకరణ) అని పేరుపెట్టారు. దీన్ని అర్థం చేసుకోటానికి చాతుర్వర్ణ సిద్ధాంతం చాలా అడ్డంకిగా ఉందని ఎన్నో ఉదాహరణలతో వివరించారు. అసలు ధర్మశాస్త్రాల్లో వర్ణించిన విధంగా మన సమాజం ఎప్పుడూ లేదు. ఆ గ్రంథాలన్నీ అప్పటికే ఉన్నత స్థానంలో ఉన్నవారు సమాజం ఇలా ఉండాలి... అలా ఉండాలి... అని నిర్దేశిస్తూ రాసినవిగానే చరిత్రకారులు భావిస్తారు. మన ప్రాచీన గ్రంథాల్లో వాస్తవాల వర్ణన శాతం చాలా తక్కువ. వాటిని ఆధారం చేసుకుని వివిధ ప్రాంతాలను పాలించిన రాజవంశాల పేర్లనే ఇప్పటికీ కచ్చితంగా నిర్ధారించలేం. సామాజిక జీవన చిత్రాన్ని వాటి నుంచి రాబట్టం చాలా కష్టం. వర్ణాలను స్థూల శ్రమ విభజనకు నిదర్శనంగా మాత్రమే పరిగణించాలని చెప్పే వారూ ఉన్నారు. అలాగే వ్యక్తి గుణకర్మలను బట్టే వర్ణాల కేటాయింపు జరిగిందని వాదించే వారి సంఖ్యా తక్కువ కాదు. గుణకర్మలను బట్టి ఒక వర్ణం వారు ఇంకో వర్ణంలోకి మారే వెసులుబాటు ఉందని బోధించే వారూ మనకు కనపడతారు. సంప్రదాయవాదులు చేసే ఈ సమర్థనల జోలికి పోకుండా మన సమాజాన్ని అర్థం చేసుకోటానికి చాతుర్వర్ణ సిద్ధాంతం ఎలా అడ్డంకిగా మారిందో ఎం.ఎన్.శ్రీనివాస్ వివరించారు. మనది సుదీర్ఘ చరిత్ర ఉన్న కుల సమాజం. కులాలు ఎప్పటి నుంచో ఉన్నాయి. కాలక్రమంలో కొత్త కులాలూ వచ్చాయి. కులాల స్థాయి, హోదాల గురించి పెనుగులాటలూ జరిగాయి. చాతుర్వర్ణ సిద్ధాంతం ప్రకారం చూస్తే ఇవేమీ కనపడవు. వర్ణ సిద్ధాంతం ప్రకారం నాలుగే కులాలు/వర్ణాలు ఉంటాయి. వీటి హోదాలు శాశ్వతం. దళితులకు ఈ సిద్ధాంత చట్రంలో స్థానం లేదు. సమాజంలోని వందలాది కులాలను పరిగణనలోకి తీసుకుంటే ఇది చాలా అసంబద్ధంగా తోస్తుంది. వర్ణ సిద్ధాంతంలో మార్పునకు అవకాశం లేదు. కులాల పరిస్థితి దీనికి భిన్నం. కుల సమాజంలో ఎన్నో మార్పులు జరిగాయి. హోదాల పెంపుదల కోసం ప్రయత్నాలు నిరంతరం సాగుతూనే ఉండేవి. ఆ ప్రయత్నంలో కులాల మధ్య వివాదాలు ముదిరితే విషయం రాజు దగ్గరికి వెళ్లేది. ఏ కులం పెద్దది, ఏ కులం చిన్నది.. అన్న దాంట్లో తుది తీర్పు రాజుదే. హిందూ రాజులే కాకుండా ముస్లిం రాజులు కూడా ఈ తీర్పులు ఇచ్చేవారు. 1) బహుళ సంస్కృతులను అంగీకరించటం. అంటే ప్రతి కులానికి కొన్ని ప్రత్యేక పద్ధతులు, సంప్రదాయాలు ఉంటాయని ఆమోదించటం అన్న మాట. 2) పై స్థాయిలో ఉన్న కులాలను కింది స్థాయి వారు అనుకరించటం రెండో లక్షణం. ఈ అనుకరణ అనేది అన్నిచోట్లా సాఫీగా జరిగిందని భావించలేం. కొన్నిచోట్ల అది హింసకు, ప్రతిఘటనకు దారితీసింది. మరికొన్ని చోట్ల అంచెలంచెలుగా మాత్రమే ఆమోదం లభించింది. తమిళనాడు రామనాద్ జిల్లాలోని కల్లాల కులస్థులు.. ఆది ద్రవిడుల విషయంలో విధించిన నిషేధాలను చూస్తే ప్రతిఘటన ఎంత తీవ్రంగా ఉండేదో తెలుస్తుంది. 1) ఆది ద్రవిడులు బంగారం, వెండి ఆభరణాలను ధరించకూడదు. 2) మగవాళ్లు నడుముకు పైభాగాన వస్త్రాలు వేసుకోకూడదు. 3) బనియన్లు, చొక్కాలు కూడా ధరించకూడదు. 4) జుట్టు కత్తిరించుకోకూడదు. 5) మట్టి పాత్రలు మినహా వేటినీ వాడకూడదు. 6) మహిళలు జాకెట్లు ధరించకూడదు. 7) పూలు పెట్టుకోకూడదు. కుంకుమపువ్వును వాడకూడదు. 8) పురుషులు గొడుగులను వాడకూడదు. చెప్పులను వేసుకోకూడదు. దేవతారాధన, స్త్రీపురుష సంబంధాల్లో బ్రాహ్మణ పద్ధతులను అనుసరించటం చాలా చోట్ల జరిగినా అదే ఏకైక సంస్కృతీకరణ మార్గమని చెప్పలేం. కొన్ని కులాలకు ఒకప్పుడు అమ్మ దేవతలు తప్ప పురుష దేవతలే లేరు. శివాలయాలు, రామాలయాల సంగతే తెలియదు. బ్రాహ్మణులు కొలిచే దేవుళ్లకు స్థానంలేదు. ఆ వర్గ పూజారులకూ చోటు లేదు. సంస్కృతీకరణలో భాగంగా ఈ దేవుళ్లూ, పూజారులు వచ్చారు. సంస్కృతీకరణలో చాలా చోట్ల ప్రధానపాత్ర ఆధిపత్య కులానిది. ప్రతి ప్రాంతంలోనూ ఒకటో రెండో ఆధిపత్య కులాలు (కమ్మ, రెడ్డి, వెలమ, కాపు, ఒక్కలిగ, మరాఠీ లాంటివి) ఉంటాయి. సాధారణంగా వీటి ఉనికి ఆయా ప్రాంతాలకే పరిమితమై ఉంటుంది. వేర్వేరు ప్రాంతాల్లో వేర్వేరు ఆధిపత్య కులాలు ఉంటాయి. ఈ కులాల చేతుల్లో సారవంతమైన భూములు ఉంటాయి. సంఖ్యాబలం కూడా ఉంటుంది. వీళ్ల మీద ఆధారపడి వృత్తి, సేవా కులాలు మనుగడ సాగించేవి. ఈ ఆధిపత్య కులాలను అనుకరించటం సంస్కృతీకరణలో చాలా చోట్ల కనపడుతుంది. రాజ్యాధికారం కులాల బలాబలాలను చాలా ప్రభావితం చేసింది. రాజ్యాలను పాలించిన వాళ్లల్లో ఎక్కువ మంది కింది కులాల నుంచి వచ్చిన వారే. అధికారాన్ని పొందిన తర్వాత వీళ్లని స్వచ్ఛశూద్రులని అన్నారు. అధికారాన్ని సుస్థిరం చేసుకుని బ్రాహ్మణులను పోషించటం మొదలుపెట్టాక క్షత్రియ హోదాను సంపాదించారు. తాము ఎప్పటి నుంచో క్షత్రియులమని చెప్పటానికి కల్పిత వంశచరిత్రలను రాయించుకున్నారు. యుద్ధాలతో రాజ్య వ్యవస్థ నిరంతరం ఒడిదుడుకులకు లోనయ్యేది. కేంద్రీకృత రాజ్యాలు మనకు తక్కువ. పరస్పరం సంఘర్షించే రాజ్యాలే ఎక్కువ. ఈ పరిస్థితి నిరంతర సైన్య సమీకరణకు అనుకూలంగా ఉండేది. సొంత కులం నుంచి సాహసికులను సమీకరించుకుని పోరాడిన వారికి రాజ్యాధికారం కొన్నిసార్లు దక్కేది. దాంతో కుల సామాజిక హోదా పెరిగేది. భక్తి ఉద్యమం కూడా సంస్కృతీకరణకు చాలా దోహదం చేసింది. ఒక మనిషి గౌరవం పుట్టుక కంటే అతను చేసే పనులపై ఆధారపడి ఉంటుందని భక్తికవులు బలంగా చెప్పారు. భక్తికి కర్మకాండలు అవసరం లేదనీ ప్రచారం చేశారు. అందుకే కింది కులాల నుంచి కూడా భక్తికవులు వచ్చారు. సంస్కృతీకరణలో మరో కోణం కూడా ఉంది. కింది కులాల అలవాట్లను కూడా పై కులాల వాళ్లు స్వీకరించిన ఉదంతాలూ ఉన్నాయి. కేరళలో కొన్ని చోట్ల పితృస్వామ్యం నుంచి మాతృస్వామ్యానికి మారిన సంఘటనలు కనపడతాయి.

## ఎన్నికల్లో ప్రత్యేక బృందాల పాత్ర కీలకమైనది: కలెక్టర్



ఆసిఫాబాద్, ఫిబ్రవరి 15: వచ్చే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో వీడియో, స్టాటిక్ సర్వేయలెన్స్, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందాల పాత్ర కీలకమైనదని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దీపక్ తివారితోకలిసి వీడియో సర్వేయలెన్స్, స్టాటిక్ సర్వేయ లెన్స్, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందా లు, సహాయవ్యయపరిశీలకులకు ఏర్పాటుచేసిన శిక్షణకార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన వెంటనే ప్రత్యేకబృందాలు తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. వీడియో సర్వేయలెన్స్, స్టాటిక్ సర్వేయలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ బృంద సభ్యులు ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి విచారణ జరిపి నివేదిక సమర్పించాలన్నారు. చెక్‌పోస్టులవద్ద తనిఖీలను పకడ్బందీగా చేపట్టాలన్నారు. సరైన ఆధారాలులేని డబ్బులు, ఆభర ణాలు, కానులను సీజ్‌చేసి స్థానిక పోలీసుస్టేషన్‌లో భద్రపరిచి పంచనామా పూర్తైన తరువాత అప్పగించాలన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా రాజకీయపార్టీలు, అభ్యర్థులు నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాలు, ర్యాలీలు ఇతర ప్రచార సంబంధిత అంశాలపై దృష్టిసారించి వీడియో చిత్రీకరించి వ్యయపరిశీలకులకు అందించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో కంట్రోల్‌రూం, సీవిజిల్ ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. కార్యక్రమంలో శిక్షణ నోడల్ అధికారి, జిల్లా గిరిజనాభివృద్ధిఅధికారి రమాదేవి, వీడియోసర్వేయలెన్స్, స్టాటిక్ సర్వేయలెన్స్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల సభ్యులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వెంకన్న స్వామికి బంగారు పూత ఆభరణాలు బహూకరణ

బిజినేపల్లి: అలువేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మాఘ రథసప్తమి పురస్కరించుకొ ని స్వామి వారికి బంగారు పూత పూసిన అ భయ హస్తం, వామహస్తం అభరణాలను స మర్పించినట్లు దాత విశ్రాంత కళాశాల ప్రిన్సి పాల్ కృష్ణగౌడ్, మంజుల దంపతులు తెలిపా రు. పాలెం వెంకన్న స్వామి ఆలయంలో దా తలు సమర్పించిన అభరణాలకు గురువారం ఆలయ చైర్మన్ జున్న శేఖర్ రెడ్డి, ఈవో రంగారావులు స్వీకరించి ఆలయ ప్రధాన అ ర్చకులు రామానుజచార్యులచే శాస్త్రోక్తంగా ప్ర త్యేక పూజలు చేసి స్వామి వారికి అలకరించా రు. అభరణాల విలువ రూ.లక్షా పది వేలు ఉంటుందని దాత కుటుంబ సభ్యులు డాక్టర్ శరత్ చంద్ర గౌడ్, శ్రీహితలు పేర్కొన్నారు. అనంతరం కుటుంబ సభ్యులందరికీ గోత్ర నా మాలతో ప్రత్యేక పూజలు చేసి వేద పండితు లు ఆశీర్వదించారు. వారి వెంట ఎంపీఈ శ్రీనివాస్ గౌడ్, గాడి సురేందర్, గంధం వెంకటేశ్వర్లు, సొప్పరి బాలస్వామి తదితరులు ఉన్నారు.

# నరేంద్ర మోడీ దశాబ్ది పాలన

మనం బుర్రను పక్కన పెట్టి చెవులప్పగిస్తే ఎదుటివారు రాజస్థాన్‌లో సముద్రం, హిమాలయాల్లో భరించలేని వేడి, ఎండిపోయిన బంగాళాఖాతం అంటూ ఎన్ని కబుర్లు అయినా చెబుతారు. ఈ మధ్యనే ప్రపంచ ఆర్థిక వేదిక మీద 34 ముప్పుల్లో తప్పుడు సమాచారంలో భారత్ మొదటి స్థానంలో ఉందని ప్రపంచ వ్యాప్తంగా 1,490 వివిధ రంగాలకు చెందిన ప్రముఖులను సర్వేచేసినపుడు వెల్లడైన నిష్ఠుర సత్యం. విశ్వగురువుగా నరేంద్ర మోడీకి ప్రపం చం నీరాజనాలు అర్పిస్తున్నదని చెబుతున్నవారు దీని గురించి ఏం చెబుతారో తెలియదు. అలాంటి ముప్పులో భాగమే ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఆర్థిక పరిస్థితి మీద విడుదల చేసిన శ్వేతపత్రంలోని అంశాలు.పదేండ్ల క్రితం తాము అధికారంలోకి వచ్చినపుడు దేశం సంక్షోభ స్థితిలో ఉందని, దాని గురించి చెబితే పెట్టుబడులు పెట్టేవారు ప్రతికూలంగా ఆలోచిస్తారని, అందుకే అప్పుడే శ్వేత పత్రం ప్రకటించకుండా ఇపుడు పరిస్థితి బాగుపడినందున విడుదల చేస్తున్నట్లు మొదటి పేరాలోనే జనాన్ని తప్పుదారి పట్టించారు. నిజంగా ఇప్పుడు పరిస్థితి బాగుపడిందా, దాని అర్థం ఏమిటి ? ఏటా రెండు కోట్ల ఉపాధిని పెంచుతామని 2014లో చెప్పారు. వాస్తవ పరిస్థితి ఏమిటి? బిజెపి అధికారానికి రాక ముందు ఉన్న సమాచారం ప్రకారం 2012లో నిరుద్యోగం 2.1 శాతం. అది 2018లో నేషనల్ సర్వే సంస్థ సమాచారం ప్రకారం 6.1 శాతానికి చేరింది. దేశ కార్మికశక్తి సర్వేల ప్రకారం అంతకు ముందు 45 సంవత్సరాలతో పోలిస్తే అది అధికం. 1524 సంవత్సరాల యువతలో నిరుద్యోగం ఎంత అన్నది ప్రధానంగా చూడాలి. స్టాటిస్టా సంస్థ విశ్లేషణ ప్రకారం 2014లో మోడీ అధికారానికి వచ్చినపుడు 22.4% మందికి ఉపాధి లేదు. తరువాత 2022లో 23.22 శాతం, తొమ్మిది సంవత్సరాల సగటు 24.74% ఉంది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలను కల్పించి ఉంటే ఈ పెరుగుదల ఎలా సంభవించింది? మాక్రోట్రెండ్స్ సమాచారం ప్రకారం 1524 ఏండ్ల వయస్సులోని యువత కార్మిక శక్తిలో 2014లో 31.64% ఉండగా, మోడీ ఏలుబడిలో 2022లో 28.04 శాతానికి తగ్గింది. విద్య పెరిగిన కొద్దీ యువతలో నిరుద్యోగ శాతం కూడా పెరుగుతున్నదనే అంశాన్ని ఎందుకు మూసిపెడుతున్నట్లు ? నరేంద్ర మోడీ గొప్పగా చెప్పుకొనే నైపుణ్యం తీరు ఎలా ఉంది. 2021 భారత నైపుణ్య నివేదిక ప్రకారం దాదాపు సగం మంది డిగ్రీ కలిగిన వారు నిరుద్యోగులు. ప్రైవేటు కాలేజీలు పెరిగినందున నైపుణ్యాలు లేని పట్టాదారులు తామర తంపరగా పెరిగారన్నది మింగుడుపడ ని వాస్తవం. అందుకే ప్రభుత్వం 2015లో జాతీయ నైపుణ్య విధానాన్ని ప్రకటించింది. కార్మిక శక్తిలో 40 కోట్ల మందికి 2022 నాటికి నైపుణ్యాలను పెంచుతామని చెప్పారు. జరిగిందేమిటి? 2012లో కార్మికశక్తిలో వృత్తి విద్యావంతులు లేదా శిక్షణ పొందిన వారు 2.3% కాగా, మోడీ శిక్షణ తరువాత 2.4 శాతానికి మాత్రమే పెరిగారు. కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన సమాచారం ప్రకారం పిఎంకెవివై (నైపుణ్య శిక్షణ) మూడు రకాలుగా శిక్షణ పొందిన వారు 18, 45, 4 లక్షల మంది చొప్పున ఉన్నారు. వారిలో 14, 43, 7 శాతాల చొప్పున ఉపాధి పొందినట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ తీరుతెన్నుల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. సాంకేతిక విద్య అభ్యసించిన ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ పూర్తి చేసిన వారిలో నిరుద్యోగం గత పది సంవత్సరాల్లో రెట్టింపైంది. మన దేశంలో 2030 వరకు ఉపాధిని కోరుకొనే వారి సంఖ్య ఏటేటా గణనీయంగా పెరగనుందని వర్తమాన ధోరణి వెల్లడిస్తోంది. అంటే నిరుద్యోగమూ పెరగనుంది. కార్మికశక్తిలో మొత్తంగా, ప్రత్యేకించి మహిళల శాతం పెరగటం లేదన్నది అందరికీ తెలిసిందే.

ఎందుకు అన్నది సమస్య. అధికారానికి వచ్చిన తొలి రోజుల్లో విదేశాలు తిరిగి పెద్ద మొత్తంలో విదేశీ పెట్టుబడులు తెచ్చినట్లు నరేంద్ర మోడీ చెప్పారు. పది సంవత్సరాల తరువాత జనానికి అందినవాటి ఫలితాలేమిటో చెప్పరు. తమ వికసిత భారత్ నినాదంతో త్వరలో చైనా, అమెరికాలను మించిపోతామని చెబుతున్నారు. ఎంతగా చెట్టపట్టాలేసుకొని తిరుగుతున్నప్పటికీ మన దేశంలో పెట్టుబడి వాతావరణం వ్యాపారం చేసేందుకు పెద్ద సవాలుగా ఉందని 2022 నివేదికలో అమెరికా చెప్పింది. రక్షణాత్మక చర్యలు, భారతీయ ప్రమాణాల నుంచి అంతర్జాతీయ స్థాయికి చేరలేకపోవటం వంటి కారణాలను దానిలో పేర్కొన్నారు. అంతేకాదు ప్రపంచ ఆర్థిక స్వేచ్ఛ సూచిక 2023 నివేదిక ప్రకారం 131వ స్థానంలో మన దేశం ఉంది. ఆసియా పసిఫిక్ ప్రాంతంలోని 39 దేశాల్లో 27 వదిగా ఉంది.

దేశ ప్రతిష్ఠను, పలుకుబడిని పెంచానని, భారీ మొత్తంలో పెట్టుబడులను ఆకర్షిస్తున్నట్లు చెప్పుకోవటమే తప్ప కనిపించటం లేదు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణలో 2022లో తొలి పది దేశాల్లో మనం పదవ స్థానంలో ఉన్నాం. మొదటి స్థానంలో ఉన్న అమెరికాకు 388, రెండవదిగా ఉన్న చైనాకు 180 బిలియన్ డాలర్లు వస్తే మన దేశానికి వచ్చింది 50 బి. డాలర్లు. విదేశీ పెట్టుబడుల సంగతి అలా ఉంటే చైనా జిడిపిలో 50 శాతం పెట్టుబడులు పెడుతుంటే మన దేశంలో 30 శాతమే ఉంది. చైనా ఉత్పాదక రంగం జిడిపికి 30% సమకూర్చుతుంటే మన దగ్గర 20 శాతమే ఉంది. యుపిఎ పాలనలో ఎన్ని వేల కిలోమీటర్ల రోడ్లు వేశారు, మా పాలనలో ఎలా వేశామో చూడండి అని బిజెపి అడ్డసవాళ్లు విసురుతుంది. మౌలిక సదుపాయాలకు గాను 2013 14లో జిడిపిలో 1.7% ఉన్న మొత్తాన్ని 2022 23లో 2.9 శాతానికి పెంచాం చూడండి అని చెబుతారు. పదేండ్ల సగటు 1.93 శాతం. ఇక్కడ సమస్య పెట్టుబడి వ్యయాన్ని పెంచాల్సిందే అది అవసరాలకు తగినట్లుగా ఉండాలి. పారిశ్రామిక ఉత్పత్తి లేకుండా ఎన్ని రోడ్లు, రైలు మార్గాలు వేసినా, ఓడరేవులను అభివృద్ధి చేసినా ప్రయోజనం ఏముంటుంది.

పెట్రోలు, డీజిలుమీద విపరీతంగా సెస్‌లను పెంచారు. ఎందుకు అంటే దేశ రక్షణకు డబ్బు ఎక్కడ నుంచి తేవాలనే మనోభావాన్ని ముందుకు తెచ్చారు. ఇది నిజమా? కేంద్ర ప్రభుత్వ 202223 ఆర్థిక సర్వే 60వ పేజీలో ఇచ్చిన సమాచారం ప్రకారం 2013 14లో జిడిపిలో 1.1% కేటాయిస్తే 2022 23లో 0.9 శాతంగా ప్రతిపాదించారు. పదేండ్ల సగటు 1.04%. ఈ కాలంలో చేసిన అప్పులు 4.5 నుంచి 6.4 శాతానికి చేరాయి. పదేండ్ల సగటు 4.99%. దీనికి అనుగుణంగానే వడ్డీ చెల్లింపులు 3.3 నుంచి 3.6 శాతానికి పెరిగాయి. అచ్చేదిన్ గురించి కబుర్లు చెప్పిన పెద్దలు సబ్సిడీ మొత్తాన్ని 2.3 నుంచి 1.2 శాతానికి దిగ్గోశారు. పదేండ్ల సగటు 1.74%. ముందే చెప్పినట్లుగా అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల ఖర్చు పెరగాలి. దాని కోసం సంక్షేమ కార్యక్రమాల ఖర్చు తగ్గింపు సమర్థనీయమా? పారిశ్రామిక ఉత్పత్తి విలువ తమ ఏలుబడిలో ఎంత పెరిగిందో చూడమని మోడీ భక్తులు చెబుతారు. ఆ మేరకు ఉపాధి ఎందుకు పెరగలేదో చెప్పలేరు.మరోవైపు జిడిపిని ఎంత పెంచామో చూడండి అంటా రు. ప్రపంచ బ్యాంకు విశ్లేషించిన దాని ప్రకారం 2014లో మన పారిశ్రామిక ఉత్పత్తి విలువ 307 బిలియన్ డాలర్లు, అది 2022 నాటికి 450 బి.డాలర్లకు పెరిగింది. ఇదే కాలంలో జిడిపిలో దాని వాటా 15 నుంచి 13.32 శాతానికి దిగజారింది. కార్మిక శక్తిలో 15 24 సంవత్సరాల వయస్సు వారు ఎందరున్నారు అంటే 2014లో 31.64% ఉంటే 2022 నాటికి 28.04కు పడిపోయింది. దీని అర్థం ఏమిటి ఉపాధి రహిత వృద్ధి జరుగుతున్నది. దీని వలన కార్పొరేట్ల సంపద పెరుగుతుంది తప్ప జనానికి దక్కేదేముంది. ఏ దేశమైనా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నపుడు డిమాండ్‌ను పెంచేందుకు ప్రభుత్వాలు పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడతాయి. దాని వలన వివిధ రంగాలు కొంతమేరకు సానుకూలంగా స్పందిస్తాయి. ఉదాహరణకు రోడ్ల నిర్మాణం జరిపితే సిమెంటు, ఉక్కు, చమురు, రోడ్డు నిర్మాణ వాహనాలు తదితర ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతుంది. ఈ కారణంగానే 2020 21లో మూలధన వ్యయం కేంద్ర బడ్జెట్‌లో రూ. 4.26 లక్షల కోట్లుండగా, 2023 24లో రూ. 10 లక్షల కోట్లకు పెంచారు. (ఎన్నికల సంవత్సరం కదా!) ఒక్కసారిగా ఇంత పెరుగుదల ఎప్పుడూ లేదు. రైల్వే, రోడ్లు, రక్షణ రంగం వాటా 66% ఉంది. రాష్ట్రాలలో మౌలిక సదుపాయాలకు ఇచ్చే 50 ఏండ్ల వడ్డీ లేని రుణ మొత్తం అంతకు ముందు ఉన్న రూ. 76 వేల కోట్లను లక్షా 30 వేల కోట్లకు పెంచారు. ఇదే సమయంలో కొన్ని రంగాలకు ఎలా కోతలు పెట్టారో చూద్దాం. 2009 తరువాత తొలిసారిగా సామాజిక సంక్షేమ ఖర్చు 18 శాతానికి తగ్గింది. 2023 24 బడ్జెట్‌లో రూ. 8.28 లక్షల కోట్లుగా ప్రతిపాదించారు. అంతకు ముందు సంవత్సరం కంటే 56 వేల కోట్లు తక్కువ. విద్యారంగానికి కేటాయింపులు 2009 2021 మధ్య 20 నుంచి 9 శాతానికి తగ్గాయి. 2023 24లో 14% ఉన్నప్పటికీ తక్కువే కదా! గ్రామీణాభివృద్ధి కేటాయింపులు 28 నుంచి 19 శాతానికి తగ్గాయి. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఆరోగ్యం, విద్య, పోషకాహారం వంటి వాటికి తగ్గటం లేదా గిడసబారి ఉన్నాయి. పదకొండు సాంఘిక సంక్షేమ రంగాలలో కరోనాకు ముందు 2019 20లో ఉన్న కేటాయింపుల కంటే 2023 24లో ఐదింటిలో తగ్గాయి. అవి స్వచ్ఛభారత్, సమగ్ర విద్యా శిక్షణ, గ్రామీణ ఉపాధి హామీ పథకం, జాతీయ ఆరోగ్య కార్యక్రమం. రాష్ట్రాలు తమ వాటాను చెల్లించని కారణంగా కొన్ని పథకాలకు నిధులు పెంచలేదని కేంద్ర అధికారులు చెప్పారు.

# అమెరికాలో బుబోనిక్ ప్లేగు కేసు నమోదు....



**లాస్ ఏంజిల్స్ :** అమెరికాలోని ఓరేగాన్ రాష్ట్రంలో అరుదైన వ్యాధి కేసు నమోదు అయ్యింది. ఓ వ్యక్తికి బుబోనిక్ ప్లేగు సోకినట్లు గుర్తించారు. పెంపుడు పిల్లి నుంచి ఆ వ్యాధి వ్యాపించి ఉంటుందని భావిస్తున్నారు. బుబోనిక్ ప్లేగు వల్ల ఒకప్పుడు యూరోప్‌లో భారీ నష్టం జరిగింది. మధ్యయుగంలో యూరోప్‌లో సోకిన ఆ ప్లేగు వల్ల సుమారు మూడవ వంత జనాభా మృతిచెందింది. దీన్నే బ్లాక్ డెత్‌గా వర్ణిస్తున్నారు. ఓరేగాన్‌లోని డిసెచూట్స్ కౌంటీలో తాజా కేసును గుర్తించారు. అతనికి ట్రీట్మెంట్ ఇస్తున్నామని అధికారులు చెప్పారు. బాధితుడి సమీపంలో ఉన్న వారిని గుర్తించి చికిత్స అందిస్తున్నారు. ఆ వ్యక్తికి చెందిన పెంపుడు పిల్లికి కూడా ట్రీట్మెంట్ ఇస్తున్నట్లు డాక్టర్ రిచర్డ్ వాసెట్ తెలిపారు. జంతువు నుంచి ప్లేగు వైరస్ సోకిన 8 రోజుల తర్వాత మనిషిలో ఆ వ్యాధి లక్షణాలు కనిపిస్తాయని అధికారులు చెప్పారు. జ్వరం, బలహీనత, చలి, వొళ్లు నొప్పులు ఆ లక్షణాల్లో ఉన్నాయి. ప్రాథమిక దశలో బుబోనిక్ ప్లేగును గుర్తించి చికిత్స అందించాలి.

# రైతులపై అణచివేత దారుణం



న్యూఢిల్లీ: ప్రజాస్వామ్య హక్కులపై జరిగే ఎలాంటి దాడినైనా కిసాన్ ఉద్యమం ప్రతిఘటిస్తుందని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. రైతు సంఘాల ఢిల్లీ చలో మార్చ్‌ను నిరోధించడానికి మోడీ ప్రభుత్వం అధికారాన్ని విపరీతంగా ఉపయోగించుకోవడం, లాఠీ ఛార్జ్, రబ్బరు బుల్లెట్, టియర్ గ్యాస్ ప్రయోగించడం, సామూహిక అరెస్టులకు పాల్పడటాన్ని ఎస్‌కెఎం తీవ్రంగా ఖండించింది. రైతులపై టియర్ గ్యాస్ షెల్స్ వేయడానికి డ్రోన్‌లను ఉపయోగించడం ఆశ్చర్యం కలిగిస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ల ఫిబ్రవరి 16న దేశంలోని అన్ని గ్రామాలలో రైతులపై జరిగిన దాడిని తీవ్రంగా నిరసించాలని, దేశవ్యాప్తంగా గ్రామీణ బంద్, పారిశ్రామిక / సెక్టోరల్ సమ్మెను మరింత భారీగా విజయవంతం చేయాలని ఎస్‌కెఎం పిలుపునిచ్చింది. రైతుల శాంతియుత పోరాటంపై దాడి చేసేందుకు పోలీసులను, సాయుధ భద్రతా బలగాలను దింపడం మోడీ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని వెల్లడిస్తోందని పేర్కొంది. ప్రజాస్వామ్య సమాజంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందని, అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించి, వారి జీవనోపాధిని కాపాడే డిమాండ్లను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొంది.

# సోనియా రాజ్యసభ నామినేషన్.....!




**జైపూర్ :** రాజ్యసభ ఎన్నికల్లో రాజస్థాన్ నుంచి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ పోటీ చేస్తున్నారు. ఇందుకోసం ఆమె ఈరోజు నామినేషన్ దాఖలు చేయనున్నారు. రాజధాని జైపూర్ చేరుకున్న ఆమె వెంట రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ కూడా ఉన్నారు. సోనియా గాంధీ లోక్‌సభ నుంచి కాకుండా రాజ్యసభ నుంచి పార్లమెంటుకు చేరుకుంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో ప్రియాంక గాంధీ యూపీలోని రాయ్‌బరేలీ స్థానం నుంచి లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగుతారనే ప్రచారం జరుగుతోంది. కాగా ఫిబ్రవరి 8వ తేదీ నుంచి రాజ్యసభ ఎన్నికలకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. నామినేషన్ పత్రాల పరిశీలన ఫిబ్రవరి 16న జరగనుంది. అభ్యర్థులు ఫిబ్రవరి 20లోగా తమ పేర్లను ఉపసంహరించుకోవచ్చు. అవసరమైతే ఫిబ్రవరి 27న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ నిర్వహించి, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభించనున్నారు.


# వారందరినీ రాష్ట్రం నుంచి వెళ్లగొడతాం....!

ఇంఫాల్ : మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 1961 తర్వాత రాష్ట్రంలోకి వచ్చి జీవనం సాగిస్తున్న వారందరినీ గుర్తించి పంపించి వేస్తామని ప్రకటించారు.

ఇంఫాల్‌లో ఒక స్కిల్ డెవలప్‌మెంట్ ప్రొగ్రాంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. కులం, మతంతో సంబంధం లేకుండా అలాంటి వారిని రాష్ట్రం నుంచి వెళ్లగొడతామని పేర్కొన్నారు.



# పాక్ ప్రధానిగా షెహబాజ్....!



కొత్త ప్రధానిగా షెహబాజ్ షరీఫ్ బాధ్యతలు చేపట్టనున్నారు!. ఆయనను నామినేట్ చేస్తూ పాకిస్థాన్ ముస్లిం లీగ్ (నవాజ్) నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని ఆ పార్టీ అధికార ప్రతినిధి మరియం ఔరంగజేబ్ ఎక్స్‌లో ప్రకటించారు. 74ఏళ్ల నవాజ్ షరీఫ్ తన సోదరుడు 72ఏళ్ల షెహబాజ్‌ను నామినేట్ చేశారని వెల్లడించారు. మరియం నవాజ్‌ను పంజాబ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు. ప్రధాన మంత్రి పదవి రేసు నుంచి తాను తప్పుకొంటున్నట్లు పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) ఛైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ మంగళవారం స్పష్టం చేశారు. సర్కారు ఏర్పాటులో పీఎంఎల్-ఎన్‌కు మద్దతిస్తామని ప్రకటించారు. ప్రభుత్వంలో చేరబోమన్నారు. ఈ నెల 8న జరిగిన ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన పీఎంఎల్-ఎన్, పీపీపీ, పీటీఐలు ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీని సాధించలేదు. హంగ్ ఏర్పడిన నేపథ్యంలో సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు సంప్రదింపులు జరుగుతున్నాయి. తాజా పరిస్థితులపై చర్చించేందుకు పీపీపీ కేంద్ర కార్యనిర్వాహక కమిటీ మంగళవారం సమావేశమైంది. అనంతరం బిలావల్ విలేకరులతో మాట్లాడారు. 'ఫెడరల్ ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన మెజారిటీని మా పార్టీ సాధించలేకపోయింది. అందువల్ల నేను ప్రధాని రేసులో ఉండటం లేదు. పీపీపీతో కలిసి సంకీర్ణ సర్కారు ఏర్పాటుకు పీటీఐ పార్టీ నిరాకరించింది. అందువల్ల పీఎంఎల్-ఎన్ వైపు మొగ్గాం' అని తెలిపారు. దేశంలో రాజకీయ సుస్థిరత కోసం తాము నవాజ్ పార్టీకి చెందిన ప్రధాన మంత్రి అభ్యర్థికి మద్దతు పలకాలని నిర్ణయించినట్లు చెప్పారు. పీపీపీ అగ్ర నాయకులతో షెహబాజ్ ఇటీవల భేటీ అయినప్పుడు అధికార పంపకం గురించే చర్చలు జరిగాయి. అధికార పంపిణీలో భాగంగా ప్రధాని పదవిని తీసుకొని.. దేశాధ్యక్ష, జాతీయ అసెంబ్లీ స్పీకర్, సెనెట్ ఛైర్మన్ వంటి కీలక పదవులను వదులుకోవడానికి పీఎంఎల్-ఎన్ సిద్ధపడిందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ విషయాన్ని ఆ పార్టీ అధికార ప్రతినిధి మరియం ఔరంగజేబ్ ఎక్స్‌లో ప్రకటించారు. 74ఏళ్ల నవాజ్ షరీఫ్ తన సోదరుడు 72ఏళ్ల షెహబాజ్‌ను నామినేట్ చేశారని వెల్లడించారు. మరియం నవాజ్‌ను పంజాబ్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించారు. ప్రధాన మంత్రి పదవి రేసు నుంచి తాను తప్పుకొంటున్నట్లు పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ) ఛైర్మన్ బిలావల్ భుట్టో జర్దారీ మంగళవారం స్పష్టం చేశారు.

# అమెరికా అధ్యక్ష బాధ్యతలకు సిద్ధమే



**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించడానికి తాను సిద్ధమేనని ఉపాధ్యక్షురాలు కమలాహారిస్ స్పష్టంచేశారు. అధ్యక్షుడు జో బైడెన్ జ్ఞాపకశక్తి, వయసుపై తీవ్ర విమర్శలు వస్తున్న వేళ..ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికా మీడియా వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో భారత సంతతికి చెందిన కమలా హారిస్ మాట్లాడుతూ.. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించడానికి తాను సిద్ధమేనని, అందులో ఎలాంటి సందేహం లేదని తేల్చిచెప్పారు. తనను గమనించిన ప్రతి ఒక్కరికీ తన సామర్థ్యం గురించి తెలుసునని వ్యాఖ్యానించారు. అధ్యక్ష పదవిలో ఉన్నవారు అనూహ్యంగా పదవి నుంచి వైదొలిగితే ఉపాధ్యక్ష స్థానంలో ఉన్నవారు ఆ బాధ్యతలను చేపడతారు. ఈ ప్రకారంగా హారిస్‌కు ఆ అవకాశం ఉంది. వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల బైడెన్ జ్ఞాపకశక్తిలో అనేక లోపాలను గుర్తించినట్లు ఇటీవల ఒక నివేదిక పేర్కొంది. జీవితంలోని కీలక సంఘటనలు సైతం ఆయనకు జ్ఞాపకం లేవని తెలిపింది. అయితే ఈ నివేదికను వైట్‌హౌస్ ఖండించింది. హారిస్ కూడా బైడెన్‌కు మద్దతుగా నిలిచారు. ఆయన అద్భుతమైన నాయకుడు అని ఎన్నికల ప్రచారంలో కొనియాడారు.

# మోడీ సర్కార్ లఉలికిపాటు రాజధానిలో

## నిరసన గళం విప్పిన కర్ణాటక, కేరళ



**న్యూఢిల్లీ :** నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర సర్కారుకు వ్యతిరేకంగా 'నా పన్ను, నా హక్కు' పేరుతో కర్నాటక ప్రభుత్వం దేశ రాజధానిలో నిర్వహించిన నిరసన కార్యక్రమం ప్రతిపక్షాల్లో ఉత్సాహాన్ని నింపింది. మరో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఒక్కొక్కటిగా కేంద్రంపై బాహాటంగా గొంతు విప్పుతున్నాయి. మోడీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుండీ ప్రజా సమస్యలను గాలికి వదిలేసి మందిరం, మతోన్మాద జాతీయోన్మాదం, దేశభక్తి వంటి భావోద్వేగపూరితమైన అంశాలనే పట్టుకొని వేళ్లాడుతోంది. రాష్ట్రాల హక్కులను హరిస్తోంది. దీనికి ప్రతిఘటన కూడా అదే స్థాయిలో ఎదురవుతున్నది. కర్ణాటకకు చెందిన కాంగ్రెస్ నేతలు ఢిల్లీ వచ్చి రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వ వివక్షకు వ్యతిరేకంగా గళమెత్తగా.. ఆ మరునాడే కేరళకు చెందిన వామపక్ష నేతలు ఇతర ప్రతిపక్షాలను కలుపుకొని జంతర్ మంతర్ వద్ద భారీ ధర్నా నిర్వహించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత కాంగ్రెస్‌కు చెందిన బెంగళూరు రూరల్ ఎంపీ, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేష్ కేంద్ర ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మోడీ ప్రభుత్వం దక్షిణాదికి తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. మరో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలు ఒక్కొక్కటిగా కేంద్రంపై బాహాటంగా గొంతు విప్పుతున్నాయి.

# విచారణ ఖైదీలూ దేశ పౌరులే...


ఇంకా నేరం రుజువు కాకుండా, న్యాయమూర్తి శిక్ష వేయకుండా జైలులో విచారణ ఖైదీలుగా ఉన్నవారికి మన చట్టాలు ఓటు హక్కు వినియోగించే అవకాశం ఈయడం లేదు. 2019 లోక్‌సభ ఎన్నికలలో దాదాపు 90 కోట్ల మంది భారతీయ పౌరులు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, వారిలో సుమారు ఐదు లక్షల మందికి ఓటు వేసే అవకాశం లభించలేదు. కారణం వారు జైళ్లలో బందీలుగా ఉన్నారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 62(5) ప్రకారం జైలు శిక్ష అనుభవిస్తున్నవారు, విచారణ ఖైదీలు, చట్టబద్ధమైన కస్టడీలో ఉన్నవారు ఎన్నికలలో ఓటు వేయకూడదు. ఇలా దేశంలో ఐదు లక్షల మంది ఓటు హక్కు హరించడం వల్ల ఎన్నికల ఫలితాలు తారుమారయ్యే అవకాశాలు కూడా లేకపోలేదు. గ్రామాల్లో వార్డు స్థాయి ఎన్నికల్లో ఈ ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. ఎన్నికలకు రెండు రోజుల ముందు ఏదో ఫిర్యాదుపై పది మందిని జైలుకు పంపితే వారి ఓట్లు పడక గెలుపోటములు మారిపోవచ్చు. విచిత్రమేమిటంటే బెయిల్‌పై ఉన్నవారు మాత్రం ఓటు వేయవచ్చు. మన జైళ్లలో విచారణ ఖైదీలే 80% ఉన్నారు. కాబట్టి ఓటు హక్కు విషయంలో శిక్ష పడ్డవారిని, విచారణ ఖైదీలను విడిగా చూడవలసిన అవసరం ఉంది. దోషిగా తేలిన వ్యక్తి బెయిల్‌పై బయట ఉంటే ఓటు వేయగలిగితే, కోర్టు ద్వారా నేరానికి పాల్పడినట్లు ఇంకా నిర్ధారణ కాని వ్యక్తి హక్కు మాత్రం నిరాకరించబడుతోంది. ఎన్నికల చట్టంలోని ఈ నిబంధనను సవాలు చేస్తూ కొంద రు కోర్టును ఆశ్రయించారు. అయినా కోర్టు, ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఏకాభిప్రాయానికి రాలేకపోయాయి. 1997లో ఖైదీలకు ఓటు హక్కును కోరుతూ వేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరిస్తూ, అటువంటి నిషేధం ఎందుకు అనే దానికి కొన్ని కారణాలను తెలిపింది. జైలులోని ప్రతి వ్యక్తి ఓటు వేయడానికి భద్రతా ఏర్పాట్ల కోసం పెద్ద ఎత్తున పోలీసు బలగాలు అవసరమవుతాయి. తన ప్రవర్తన ఫలితంగా జైలులో ఉన్న వ్యక్తి సమాన స్వేచ్ఛను పొందలేడు. నేర నేపథ్యం ఉన్న వ్యక్తులను ఓటు హక్కుకు దూరంగా ఉంచడం సామాజిక అవసరం అని సుప్రీం పేర్కొంది. ఏప్రిల్ 2019లో ముగ్గురు న్యాయ విద్యార్థులు ఖైదీలకు ఓటు వేసే హక్కు, ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951కి సవరణలు కోరుతూ సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. మన దేశంలో నేర, న్యాయ వ్యవస్థ స్థితిగతులను పునఃపరిశీలించడం చాలా ముఖ్యం. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని పౌరులుగా తీర్చిదిద్ది తిరిగి సమాజానికి అందించే లక్ష్యంగా ఉన్న సంస్కరణాత్మక వ్యవస్థలో ఓటు హక్కు ఒక భాగం అని వారు సుప్రీంను కోరారు. ఫిబ్రవరి 2022 లో ఢిల్లీ హైకోర్టులో వేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. అది శాసన నిర్ణయమని, అందులో కోర్టు జోక్యం కలిగించుకోలేదని పేర్కొంది. అక్టోబర్ 2022 లో దాఖలైన మరో పిటిషన్ ప్రస్తుతం సుప్రీం కోర్టు పరిశీలనలో ఉంది. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 62(5)లోని చట్టబద్ధతని పరిశీలించేందుకు సుప్రీం అంగీకరించింది. కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు నోటీసు పంపి వాటి అభిప్రాయాన్ని కోరింది. ఆ తరవాతే పిల్ విచారణకు చేపట్టనుంది. ప్రజాస్వామ్యంలో ఓటు పౌరుడికి ప్రాథమిక హక్కుగా గుర్తించాలి. దేశంలోని పరిస్థితులపై, సమస్యలపై మాట్లాడటానికి పౌరులకు అరుదైన అవకాశాన్ని ఎన్నికలిస్తాయి. జైలు ఖైదీలుగా వారి డిమాండ్ల కోసం ప్రచారం చేసే అవకాశం కూడా ఈ సందర్భంగా లభిస్తుంది. ఓటు హక్కును నిరాకరించడం ఖైదీని సమాజానికి మరింత దూరం చేయడమే అవుతుంది. ఎన్నికల మేనిఫెస్టోల్లో జైలు పరిస్థితులు లేదా చట్టాల మెరుగుదలకు సంబంధించి వాగ్దానాలు కూడా ఉండాలి. ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే చట్టాలు వివిధ ప్రభుత్వాలతో రూపొందించబడ్డాయి, అవసరమైతే మార్చబడతాయి. హక్కులు మాత్రం ప్రాథమికమైనవి, స్థిరమైనవి. అందువల్ల ఓటు హక్కులాంటి ప్రాథమిక హక్కు వ్యక్తి జైలు శిక్ష లేదా శిక్షా స్థితిపై ఆధారపడి ఉండకూడదు. ఖైదీల ఓటు హక్కును నిషేధించిన అతి కొద్ది దేశాల్లో భారత్ ఒకటి. 2018లో అమెరికాలోని ఖైదీలు దేశ వ్యాప్త సమ్మె జరిపి ప్రధాన డిమాండుగా ఓటు హక్కును సాధించారు. జైలు శిక్ష అనుభవిస్తున్న వారిని నేరం, శిక్షలవారీగా విభజించి వారికి ఓటు హక్కు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఐరోపా, స్విట్జర్లాండ్, ఫిన్లాండ్, నార్వే, డెన్మార్క్, ఐర్లాండ్, స్పెయిన్‌లలో ఖైదీల ఓటింగ్‌ను ఇప్పటికే అనుమతించారు. రోమానియా, ఐస్‌లాండ్, నెదర్లాండ్స్, స్లోవేకియా, లక్సెంబర్గ్, సైప్రస్, జర్మనీ వంటి దేశాల్లో ఓటింగ్ అనుమతించబడుతుంది కాని అది శిక్షా కాలం తదితర షరతులకు లోబడి ఉంటుంది. నేర తీవ్రతను బట్టి ఓటు నిరాకరణను అదనపు పెనాల్టీగా వారి హక్కును రద్దు చేస్తారు. బల్గేరియా పదేళ్ల కంటే తక్కువ శిక్ష పడినవారిని ఓటు వేయడానికి అనుమతిస్తుంది. ఆస్ట్రేలియాలో ఈ పరిమితి ఐదు సంవత్సరాలు ఉంది. 2006లో ఐరిష్ ప్రభుత్వం తన ఖైదీలందరికీ ఓటు వేసే హక్కును ఇచ్చింది. ఖైదీలతో సహా పౌరులందరికీ ఓటు హక్కు కల్పించే అత్యుత్తమ పౌర హక్కుల అమలు ద్వారా ఐర్లాండ్ తన మానవ హక్కులకు కట్టుబడి ఉంది. ఇరాన్, ఇజ్రాయెల్, పాకిస్తాన్ వంటి దేశాలు ఖైదీలకు ఎన్నికలలో ఓటు వేయడానికి అవకాశం కల్పిస్తున్నాయి. ఆఫ్రికా దేశాలైన దక్షిణాఫ్రికా, ఘనా, కెన్యా, బోట్స్వానా కూడా తమ ఖైదీలకు ఎన్నికలలో ఓటు హక్కును అందిస్తున్నాయి. అయితే దోషులుగా నిర్ధారించబడిన ఖైదీలపై నిషేధం ఉంటుంది. ఫ్రాన్స్ లో ఎన్నికలలో ఖైదీలు ఓటు వేయడానికి ఎటువంటి నిషేధం లేదు. ఇలా చాలా దేశాల్లో కొన్ని పరిమితులకు లోబడి విచారణ ఖైదీలే కాదు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు కూడా ఇతర పౌరుల వలె ఓటు వేయడానికి అర్హులు.

# శరీరంలో వాపుని తగ్గించే ఆహారాలు.....?

శరీరంలో వాపుని తగ్గించే ఆహారాలు ?చాలా మందికి కూడా తమ శరీరంలో అక్కడక్కడా వాపు వస్తుంది.కొన్నిసార్లు ఇది కాలేయ వ్యాధి లక్షణంగా కూడా పరిగణించబడుతుంది.ఈ సమస్యను తేలికగా తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి చాలా నష్టం వాటిల్లుతుంది.చర్మం, కీళ్లతో పాటు శరీరంలోని కణజాలాలు, అవయవాలలో కూడా వాపు వస్తుంది. సాధారణంగా వాపు వచ్చినప్పుడు అది తగ్గడానికి పెయిన్ కిల్లర్లు, ఐస్ ప్యాక్ లేదా హీట్ ప్యాక్ పెడుతుంటారు. కానీ ఈ వాపుల సమస్య నుంచి బయట పడాలంటే ఆయుర్వేదం సూచించిన ఈ ఆహారాలు తీసుకోవడం చాలామంచిది. ఆ ఆహారాలు ఏంటో ఇప్పుడు మనం తెలుసుకుందాం.ఉసిరి కాయ వాపులను తగ్గించడంలో ప్రభావవంతంగా ఉంటుంది. దీన్ని నేరుగా తినవచ్చు. లేదంటే జ్యూస్ రూపంలోనూ, జామ్, మురబ్బా, ఊరగాయ, క్యాండీ ఇలా చాలా రకాలుగా తీసుకోవచ్చు. క్రమం తప్పకుండా ఉసిరికాయను తీసుకుంటే వాపు సమస్య కొద్ది రోజుల్లోనే సమస్య ఈజీగా పరిష్కారం అవుతుంది. దానిమ్మ శరీరానికి చల్లదనాన్ని అందించి వాపుల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. దీన్ని గింజలు వలిచి నేరుగా తినవచ్చు, లేదంటే జ్యూస్ రూపంలోనూ తీసుకోవచ్చు. ఎలా తీసుకున్నా ఫలితాలుంటాయి. పెసరపప్పులో ప్రోటీన్ పుష్కలంగా ఉంటుంది. ఇది వాపును తొలగించడంలో ప్రభావవంతంగా ఉంటుంది. పెసరపప్పులో జీలకర్ర, ఇంగువ కలిపి పోపు పెట్టి ఆహారంతో తీసుకుంటే చాలా ప్రయోజనాలు ఉంటాయి.వాపు సమస్యను దూరం చేయడానికి చిటికెడు పసుపును తీసుకుంటే సరిపోతుంది. దీనిని ప్రత్యేకంగా కాకుండా వంటల్లో తీసుకోవచ్చు. లేదంటే పసుపు కలిపిన పాలు కూడా తాగచ్చు. పసుపును చిన్న గోళీల్లా చేసి పరగడుపునే తీసుకోవచ్చు. ఇది అన్ని విధాలా ప్రయోజనకరంగా ఉంటుంది.ఇక నెయ్యి ఆహారంలో తీసుకోవాలంటే చాలా మంది ఆలోచిస్తారు. కానీ దీన్ని అధిక మొత్తంలో కాకుండా తక్కువ పరిమాణంలో తీసుకోవచ్చు.




## నానబెట్టిన ఎండు ఖర్జూరం తిన్నారంటే..



మన శరీరంలోని సమస్యలన్నీ పోషకాహార లోపం వల్ల ఏర్పడతాయి. సరైన సమయంలో ఆహారం తీసుకోకపోవడం వల్లనే అనేక సమస్యలు తలెత్తుతాయి. ఆహారం అజీర్ణం, ఊబకాయం, నిద్రలేమితో పాటు గ్యాస్-గుండె మంట వంటి సమస్యలు కూడా తలెత్తుతాయి. నేటి కాలంలో గ్యాస్, గుండెల్లో మంట వంటి సమస్యలు సర్వ సాధారణం అయ్యాయి. ఈ సమస్యలన్నింటిని ఇంటి నుంచే నివారణ పొందవచ్చు. ముందుగా యాంటాసిడ్‌లను తీసుకోవడం మానుకోవాలి. అసిడిటీని సులభంగా వదిలించుకోవడానికి ప్రతిరోజూ ఈ కింది టిప్స్ ఫాలో అవ్వాలి. రోజు ప్రారంభం బాగుంటే ఆ రోజంతా మనకు మంచిగా ఉంటుంది. కాబట్టి రోజు ప్రారంభంలో ఈ నీటిని తాగండి. నానబెట్టిన ఖర్జూరంలోని గుణాల వల్ల పేగు ఆరోగ్యం పుంజుకోవడంతో పాటు శరీరంలోని నీటి లోపం కొంతమేరకు పరిష్కారం అవుతుంది. మలబద్ధకం కూడా తొలగిపోతుంది. ప్రతి రాత్రి రెండు ఖర్జూరాలను నానబెట్టి, మరుసటి రోజు ఉదయం ఖాళీ కడుపుతో ఆ ఖర్జూరాలు తినాలి. ఇది శరీరంలోని అనేక సమస్యలకు పరిష్కారం చూపుతుంది. అలాగే పొట్ట కూడా శుభ్రంగా ఉంటుంది. గ్యాస్-అసిడిటీ వంటి కడుపు సమస్యలే కాదు, ఈ డ్రై ఫ్రూట్ బహుళ శారీరక విధుల్లో చాలా ప్రభావవంతమైన పాత్ర పోషిస్తుంది. ఖర్జూరం, వాల్‌నట్స్, బాదం, ఎండుద్రాక్షలో మన శరీరానికి మేలు చేసే అనేక పోషకాలు ఉన్నాయి. ఇవి శరీరానికి శక్తిని అందిస్తుంది. రోజంతా పనిచేసినా అలసట ఉండదు. రోజూ 2-3 ఖర్జూరాలు తినాలి. అలాగే నీటిలో నానబెట్టిన ఎండుద్రాక్షను తిన్నా ఎసిడిటీ సమస్య తొలగిపోతుంది. కడుపు చల్లగా ఉంటుంది.

## ఈ మొక్కతో రోగాలన్ని మాయం?



రణపాల మొక్క ఎన్నో ఔషధ గుణాలు కలిగిన మొక్క. ఇది మిమ్మల్ని కిడ్నీ స్టోన్స్ నుండి రక్షించడమే కాకుండా ఎన్నో రుగ్మతలతో పోరాడే గుణాలను కలిగి ఉంది.ఈ మొక్కకి నొప్పి, వాపును తగ్గించే శక్తిని కలిగి ఉంది.ఈ ఆకులను మొత్తగా నూరి తలకు పట్టి వేసినట్టుగా పెట్టుకోవడం వల్ల తల నొప్పి ఈజీగా తగ్గుతుంది. ఈ ఆకుల పసరు తీసుకుని రెండు చుక్కలు చెవిలో వేసుకుంటే చెవినొప్పి కూడా ఈజీగా తగ్గుతుంది.ప్రతి రోజు ఈ ఆకుల్ని తినడం వల్ల జుట్టు రాలడం తగ్గుతుంది. మధుమేహ బాధితుల్లో రక్తంలో చక్కెర స్థాయిని కూడా ఈ మొక్క ఈజీగా తగ్గిస్తుంది. అలాగే కడుపు పూతల నుండి ఉపశమనం అందిస్తుంది.ఇంకా అలాగే, క్యాన్సర్ నుండి కూడా ఈ మొక్క రక్షిస్తుంది.ఈ మొక్కలో ఆల్కలాయిడ్స్, ఫ్లేవనాయిడ్లు, గ్లైకోసైడ్‌లు, ట్రైటెర్‌పెనెస్, కార్డినోలైడ్‌లు, బుఫాడినోలైడ్‌లు, లిపిడ్‌లు, స్టెరాయిడ్స్ వంటి బయోయాక్టివ్ సమ్మేళనాలు ఉన్నాయి. క్యాన్సర్, బ్లడ్ షుగర్, ఫంగస్, వాపు, పొట్టలో పుండు, కాలేయ సమస్య, మూత్రపిండాల్లో రాళ్లు మొదలైన సమస్యలతో పోరాడే శక్తి దీనికి ఉంది. కిడ్నీలో రాళ్లను తొలగించడానికి కూడా రణపాల ఉపయోగపడుతుంది. కిడ్నీ స్టోన్స్ కాల్షియం ఆక్సలేట్ స్ఫటికాలతో తయారవుతాయి. స్టోన్‌క్రాప్ మొక్కలో సపోనిన్‌లు ఉంటాయి. ఇవి కాల్షియం ఆక్సలేట్ స్ఫటికాలను విచ్ఛిన్నం చేయగలవు. ఈ మొక్క ఆకులను తీసుకోవడం వల్ల మీ జీవితంలో రాళ్ల సమస్య ఉండదంటున్నారు.

# పచ్చిశనగలు తింటే ఏ జబ్బు రాదు....?



పచ్చి శనగలు గురించి అందరికి తెలిసిందే. వీటిని టైం పాస్ కి ఒక్కటి తింటే ఇంకా అలాగే తినాలనిపిస్తుంది. పైగా ఇవి ఆరోగ్యానికి చాలా మంచివి. మంచి స్నాక్స్ లా వీటిని తినొచ్చు.వీటిలో కొలెస్ట్రాల్ చాలా తక్కువగా ఉంటుంది. ఇవి గుండెకు చాలా మేలు చేస్తాయి. పచ్చి శనగలలోని యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది.పచ్చి శనగల్లో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. కాబట్టి డయాబెటిక్ పేషెంట్లు పచ్చి బఠాణీలను నిర్భయంగా తినవచ్చు. షుగర్ లెవెల్స్ పెరుగుతాయన్న భయం ఉండదు.పచ్చి శనగలు తక్షణ శక్తినిచ్చే పోషకాహారం. పచ్చి శనగలు తినడం వల్ల రోజంతా ఎనర్జిటిక్‌గా ఉండవచ్చు. ఇది కడుపు నిండిన భావన కలిగిస్తుంది. పని చేయడానికి తక్షణ శక్తిని ఇస్తుంది. పచ్చి శనగల్లో డైటరీ ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది. జీర్ణ సమస్యలతో బాధపడుతుంటే, ఖచ్చితంగా నానబెట్టిన పచ్చి శనగలు తినాల్సిందే. అంతేకాకుండా, పచ్చి శనగలు బరువును నియంత్రించడంలో కూడా సహాయపడతాయి.ప్రోటీన్ ఉండే వెజిటబుల్స్‌లో శనగలు ముఖ్యమైనవి. పచ్చి శనగల్లోని ప్రొటీన్ కండరాల నిర్మాణానికి, శరీర విధులకు, రక్త ప్రసరణలో సహాయపడుతుంది. పచ్చి శనగల్లో యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఈ ఆహారం శరీరంలో రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. పచ్చి శనగలు క్రమం తప్పకుండా తినడం వల్ల జ్వరం, జలుబు వంటివి దరిచేరవు.నాన బెట్టిన పచ్చి శనగలను పోషకాహార పవర్‌హౌస్ అని అంటారు. పచ్చి శనగలను నీటిలో నానబెట్టి తినడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. శరీరానికి ఇలా చాలా రకాల ప్రయోజనాలు లభిస్తాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. కాబట్టి ఖచ్చితంగా ఇలా నాన బెట్టిన పచ్చి శనగలని ఖచ్చితంగా తినండి. ఎల్లప్పుడూ ఎలాంటి రోగాలు రాకుండా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండండి.

# నానబెట్టిన వేరుశెనగ తింటే......

వేరుశనగను సామాన్యుడి జీడిపప్పు అంటారు. వేరుశనగలో ఫాస్పరస్, ప్రొటీన్లు, లిపిడ్లు, ఫైబర్, విటమిన్లు, పొటాషియం, కాపర్, ఐరన్, సెలీనియం, జింక్, కాల్షియం వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. వేరుశెనగలో మోనోఅన్‌శాచురేటెడ్, పాలీఅన్‌శాచురేటెడ్ కొవ్వులు పుష్కలంగా ఉంటాయి. అవి గుండెకు ఆరోగ్యకరమైన కొవ్వులు. ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. వేరుశెనగలో రెస్వెరాట్రాల్ వంటి యాంటీఆక్సిడెంట్లు అధిక స్థాయిలో ఉండటం వల్ల హృదయనాళ ఆరోగ్యానికి దోహదం చేస్తుంది. ఈ గింజలను నీటిలో నానబెట్టడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. శనగలు యాంటీఆక్సిడెంట్లకు మంచి మూలం. ఇవి రోగనిరోధక శక్తిని బలపరుస్తాయి. అనేక వ్యాధులు, ఇన్ఫెక్షన్లను నియంత్రించగలదు.నానబెట్టిన వేరుశెనగలోని యాంటీఆక్సిడెంట్స్‌ఫ్రీ రాడికల్స్‌తో పోరాడడంలో సహాయపడతాయి, ప్రాణాంతక కణాలను బాడీలో పెరగకుండా నివారిస్తాయి. నానబెట్టిన వేరుశెనగలను ఖాళీ కడుపుతో తినడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం, అసిడిటీ సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు. నానబెట్టిన వేరుశెనగలను రోజూ ఉదయం తింటే రక్తప్రసరణ



మెరుగుపడుతుంది. ఇది గుండెపోటు, గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. క్యాల్షియం, మెగ్నీషియం సమృద్ధిగా ఉన్న వేరుశెనగలను నీటిలో నానబెట్టి ఉదయం ఖాళీ కడుపుతో తింటే ఎముకలు బలపడతాయి. ఎముక సంబంధిత సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. నట్స్‌లో రోగనిరోధక శక్తిని పెంచే యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఫలితంగా, అనేక అంటువ్యాధులు, వ్యాధులను నివారించవచ్చు. నానబెట్టిన వేరుశనగలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది.


# భుజం నొప్పిని లైట్ తీసుకోకండి..

మనలో చాలా మంది చిన్న చిన్న సమస్యలను పట్టించుకోకుండా వదిలేస్తుంటాము. అయితే ఈ సమస్యలున సాధారణమని వదిలేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని నిపుణులు చెబుతున్నారు.అలాంటి వాటిలో భుజం నొప్పి ఒకటని నిపుణులు చెబుతున్నారు. చాలా మంది భుజం నొప్పిని పట్టించుకోరు. అయితే భుజంలో నిరంతర నొప్పి క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధికి సంకేతమని చెబుతున్నారు. దీర్ఘకాలంగా భుజం నొప్పితో బాధపడుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. విపరీతమైన భుజం నొప్పి ఊపిరిత్తుల క్యాన్సర్‌కు సూచిక కావొచ్చని చెబుతున్నారు. ఇంతకీ ఊపిరితిత్తులకు, భుజం నొప్పికి సంబంధం ఏంటని ఆలోచిస్తున్నారా.? పాన్‌కోస్ట్ ట్యూమర్ అనేది ఊపిరితిత్తుల క్యాన్సర్. ఇది ఊపిరితిత్తుల ఎగువ భాగంలో పెరుగుతుంది. అలాగే భుజాల సమీపంలోని కణజాలంపై దాడి చేస్తుంది. దీని కారణంగా, భుజాలలో నొప్పి మొదలవుతుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్‌లో, చాలా సార్లు నొప్పి శరీరంలోని కొన్ని ఇతర భాగాలకు వ్యాపిస్తుంది. అందులో భుజం నొప్పి ఒకటని నిపుణులు చెబుతున్నారు. అయితే కొన్ని సందర్భాల్లో పని ఎక్కువైనా, కూర్చునే విధానం తప్పుగా ఉన్నా, భుజం నొప్పి వేధిస్తుంది.ముఖ్యంగా కంప్యూటర్ ముందు కూర్చునే వాళ్లలో మెడ నొప్పి కారణంగా భుజం నొప్పి వస్తుంది. దీనిని స్పాండిలైటిస్‌గా చెబుతుంటారు. అయితే ఇలాంటి ఏ పని చేయకుండా కూడా భుజం నొప్పి వేధిస్తుంటే మాత్రం వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపునులు చెబుతున్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ కారణంగా చ్చే భుజం నొప్పి సాధారణ ఆర్థరైటిస్ నొప్పిలాగే ఉంటుంది. అయితే ఈ నొప్పిలో కొన్ని చిన్న చిన్న తేడాలు ఉంటాయి. లంగ్ క్యాన్సర్ కారణంగా వచ్చే భుజం నొప్పి రాత్రిపూట ఎక్కువగా ఉంటుంది. చాలా మంది భుజం నొప్పిని పట్టించుకోరు. అయితే భుజంలో నిరంతర నొప్పి క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధికి సంకేతమని




చెబుతున్నారు. దీర్ఘకాలంగా భుజం నొప్పితో బాధపడుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని నిపుణులు సూచిస్తున్నారు. విపరీతమైన భుజం నొప్పి ఊపిరిత్తుల క్యాన్సర్‌కు సూచిక కావొచ్చని చెబుతున్నారు. ఇంతకీ ఊపిరితిత్తులకు, భుజం నొప్పికి సంబంధం ఏంటని ఆలోచిస్తున్నారా.? పాన్‌కోస్ట్ ట్యూమర్ అనేది ఊపిరితిత్తుల క్యాన్సర్. ఇది ఊపిరితిత్తుల ఎగువ భాగంలో పెరుగుతుంది. అలాగే భుజాల సమీపంలోని కణజాలంపై దాడి చేస్తుంది. దీని కారణంగా, భుజాలలో నొప్పి మొదలవుతుంది. ఊపిరితిత్తుల క్యాన్సర్‌లో, చాలా సార్లు నొప్పి శరీరంలోని కొన్ని ఇతర భాగాలకు వ్యాపిస్తుంది. అందులో భుజం నొప్పి ఒకటని నిపుణులు చెబుతున్నారు.

## చెడు కొలెస్ట్రాల్ తగ్గాలంటే....?




నేటి కాలంలో మారిన ఆహారపు అలవాట్ల కారణంగా మనలో చాలా మందిలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరిగిపోతున్నాయి. దీంతో చాలా మంది గుండె సంబంధిత సమస్యలతో బాగా బాధపడుతున్నారు.మనం అధికంగా ఆల్కహాల్ ను తీసుకోవడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ తో పాటు ట్రై గ్లిజరాయిడ్ స్థాయిలు కూడా పెరుగుతాయి.అందుకే ఆల్కాహాల్ ను మితంగా తీసుకోవడం మంచిది. కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంచుకోవాలనుకునే వారు పోషకాలు కలిగిన అల్పాహారాన్ని తీసుకోవాలి. అలాగే మనం తీసుకునే ఆహరంలో మంచి కొవ్వులు ఉండేలా చూసుకోవాలి. అవకాడో, కోడిగుడ్డు తెల్లసొన వంటి వాటిని తీసుకోవాలి. సమతుల్యమైన ఆహారాన్ని తీసుకోవడంతో పాటు నూనెలో వేయించిన ఆహారాలకు, జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలి. జంక్ ఫుడ్ శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ను విపరీతంగా పెంచుతుంది. అంతేకాకుండా గుండె ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. కనుక ఫాస్ట్ ఫుడ్ కు, జంక్ ఫుడ్ కు వీలైనంత దూరంగా ఉండాలి. అదే విధంగా శరీరం ఎల్లప్పుడూ హైడ్రేటెడ్ గా ఉండేలా చూసుకోవాలి. నీటిని ఎక్కువగా తాగాలి.దీని వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గడంతో పాటు రక్తనాళాల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉండాలనుకునే వారు ప్రోటీన్ ను ఎక్కువగా తీసుకోవాలి. చేపలు, చిక్కుళ్లు, గింజలు వంటి వాటిని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. కొలెస్ట్రాల్ స్థాయిలను ఎక్కువగా పెంచే వాటిలో ధూమపానం కూడా ఒకటి. ధూమపానం కారణంగా హృదయ ఆరోగ్యం కూడా దెబ్బతింటుంది. కనుక దీనిని వదిలేయడం మంచిది. చివరగా ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. వ్యాయామం చేయడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి.శరీరంలో కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగడానికి అధిక బరువు కూడా ఒక ప్రధాన కారణం. మన శరీరం బరువు పెరిగితే కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా పెరుగుతాయి. కనుక సమతుల్య ఆహారాన్ని తీసుకుంటూ శరీర బరువు అదుపులో ఉండేలా చూసుకోవాలి. మనం అధికంగా ఆల్కహాల్ ను తీసుకోవడం వల్ల శరీరంలో కొలెస్ట్రాల్ తో పాటు ట్రై గ్లిజరాయిడ్ స్థాయిలు కూడా పెరుగుతాయి.అందుకే ఆల్కాహాల్ ను మితంగా తీసుకోవడం మంచిది. కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంచుకోవాలనుకునే వారు పోషకాలు కలిగిన అల్పాహారాన్ని తీసుకోవాలి. అలాగే మనం తీసుకునే ఆహరంలో మంచి కొవ్వులు ఉండేలా చూసుకోవాలి. మన శరీరం బరువు పెరిగితే కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా పెరుగుతాయి. కనుక సమతుల్య ఆహారాన్ని తీసుకుంటూ శరీర బరువు అదుపులో ఉండేలా చూసుకోవాలి.

# రెట్టింపు వినోదం ఖాయం



'డీజే టిల్లు' చిత్రం ద్వారా యూత్‌కు బాగా చేరువయ్యారు హీరో సిద్ధు జొన్నలగడ్డ హైదరాబాద్ బస్తీ యువకుడిగా ఆయన పండించిన హాస్యం అందరికి గుర్తుండిపోయింది. ఇప్పుడీ సినిమాకు సీక్వెల్‌గా 'టిల్లు స్వేర్' తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. మార్చి 29న ప్రేక్షకుల ముందుకురానుంది. వాలెంటైన్స్ డేను పురస్కరించుకొని బుధవారం ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ప్రేయసి రాధిక కారణంగా చిక్కుల్లో పడ్డ టిల్లు.. సీక్వెల్‌లో కూడా అదే తరహా సమస్యలను ఎదుర్కొంటూ కనిపించారు. ఆద్యంతం హాస్య ప్రధానంగా ఊహించని ట్విస్టులతో ట్రైలర్ ఆసక్తిని పెంచింది. తొలి భాగం కంటే రెట్టింపు వినోదంతో ఈ సినిమాను తెరకెక్కించామని, ఇప్పటికే విడుదలైన పాటలు వైరల్ అవుతున్నాయని, టిల్లు పంచే వినోదం ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సాయిప్రకాష్ ఉమ్మడిసింగు, సంగీతం: రామ్ మిరియాల.



రెడ్ డ్రెస్ లో పరేషాన్ చేస్తున్న కేతిక శర్మ

# అట్లీ దర్శకత్వంలో...



'పుష్ప' చిత్రంతో పాన్ ఇండియా స్టార్‌గా అవతరించారు అగ్ర హీరో అల్లు అర్జున్. ఇక 'జవాన్' చిత్రంతో దేశవ్యాప్తంగా తిరుగులేని ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నాడు తమిళ దర్శకుడు అట్లీ. మరి వీరిద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటే అభిమానులకు ఇక పండగే. తాజా సమాచారం ప్రకారం ఈ ప్రెస్టిజీయస్ ప్రాజెక్ట్‌కు రంగం సిద్ధమవుతున్నట్లుగా తెలిసింది. ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప-2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఆగస్ట్ 15న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమా అనంతరం అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్ సినిమా పట్టాలెక్కుతుందని అంటున్నారు. ఇప్పటికే ఈ విషయమై ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని సమాచారం. అగ్ర నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ ఈ భారీ పాన్ ఇండియా చిత్రాన్ని తెరకెక్కించబోతున్నదని అంటున్నారు. అయితే ఈ వార్తల్లో నిజమెంతో తెలియాలంటే చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# కాలం రాసిన కథలు



సాగర్, వికాస్, అభిలాష్, రోహిత్, రవితేజ, హరి, శతి శంకర్, విహారిక చౌదరి, ఉమ, హాన్విక, పల్లవి రేష్మ ప్రధాన తారాగణంగా తెరకెక్కుతున్న సినిమా 'కాలం రాసిన కథలు'. ఎస్.ఎం.4 ఫిల్మ్స్ పతాకంపై నిర్మించిన చిత్రమిది. ఫ్యామిలీ, లవ్, సస్పెన్స్ జోనర్‌లో రూపుదిద్దుకున్న ఈ చిత్రం టీజర్ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన పీపుల్స్ మీడియా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శ్రీధర్ మాట్లాడుతూ.. 'మనం ప్రతి ఒక్కరి జీవితంలోనూ కాలం కొన్ని కథలు రాస్తుంది. దాన్ని బట్టే మన జర్నీ ఉంటుంది. దర్శకుడు సాగర్ గారు ఇంత మంచి కాన్సెప్ట్ ఎన్నుకోవడంతోనే సగం విజయం సాధించారు' అన్నారు. 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కించిన ఈ ప్రేమకథలో ఫ్యామిలీ ఎమోషన్స్, సస్పెన్స్, భక్తి మిళితమై ఉంటాయి' అని చిత్ర రచయిత, దర్శక, నిర్మాత ఎం.ఎన్.వి.సాగర్ చెప్పారు. ఈ సినిమాకు కెమెరా: ఎస్.ప్రసాద్, సంగీతం: మేరుగు అరమాన్.

# ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు



స్నేహం గొప్పదనాన్ని తెలియజేస్తూ ఎల్.ఓ.ఎల్. ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మించిన చిత్రం 'ట్రెండ్ మారినా ఫ్రెండ్ మారడు'. ఇంద్ర, కోమల్ నాయర్, దీపు, స్వాతిశర్మ, ఇమ్రాన్, శీతల్ భట్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. ప్రస్తుతం ఈ సినిమా నుంచి 'నా కల'.. పాటను సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ చేతుల మీదుగా చిత్ర యూనిట్ బుధవారం విడుదల చేసింది. సీనియర్ నటీనటులతోపాటు కొత్తవారు కూడా ఈ సినిమాలో నటించారని నిర్మాతలు తెలిపారు. కొత్త ప్రదేశాల్లో షూట్ చేశామని, చిత్రీకరణ పూర్తి కావస్తోందని చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రవణ్ భరద్వాజ్, నిర్మాతలు: చంద్ర ఎస్ చంద్ర, డాక్టర్ విజయ రమేశ్‌రెడ్డి, కథ-స్క్రీన్‌ప్లే-దర్శకత్వం: లక్ష్మణ్.జె.

# అనూహ్య మలుపులతో భామా కలాపం-2




ఆహా స్టూడియోస్‌తో కలిసి బాపినీడు, సుధీర్ ఈదర డ్రీమ్ ఫార్మర్స్ సంస్థ నిర్మించిన చిత్రం 'భామా కలాపం-2'. అగ్ర కథానాయిక ప్రియమణి ప్రధాన పాత్రలో నటించారు. సీరత్ కపూర్, శరణ్య, రఘు ముఖర్జీ, బ్రహ్మాజీ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. అభిమన్యు తడిమేటి దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 16 నుంచి ప్రముఖ ఓటీటీ సంస్థ ఆహాలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ బుధవారం మీడియాతో ముచ్చటించింది. హీరోయిన్ ప్రియమణి మాట్లాడుతూ.. "భామా కలాపం-2'లో అన్నీ డబుల్ ఉంటాయి. ఎక్కువ థ్రిల్స్, ట్విస్ట్‌లతో ఈ సినిమా కథ ఆసక్తికరంగా ఉంటుంది. మహిళ తలుచుకుంటే ఏదైనా సాధించగలదని ఈ చిత్రం ద్వారా తెలియజెప్పాం' అని చెప్పారు. 'నేను కాలేజీలో చదువుకుంటున్నప్పటి నుంచీ ప్రియమణి గారికి అభిమానిని. ఆమెతో వరుసగా రెండు సినిమాలు చేయడం ఆనందంగా ఉంది' అని దర్శకుడు అన్నారు.

# రేవంత్ రెడ్డి, నేను ఒకే స్కూల్‌లో చదువుకున్నాం



హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను ఒకే స్కూల్‌లో చదువుకున్నామని, తాను సీనియర్ అయితే, రేవంత్‌రెడ్డి జూనియర్ స్టూడెంట్ అని బిఆర్ఎస్ ఎంఎల్ఎ కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్ర శాసనసభ సమావేశాల్లో భాగంగా గురువారం బడ్జెట్‌పై చర్చ జరిగింది. ఈ క్రమంలో బిఆర్ఎస్ ఎంఎల్ఎ కడియం శ్రీహరి సీఎం రేవంత్ రెడ్డిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్న కడియం, సిఎం రేవంత్‌కు బిఆర్ఎస్ పార్టీ నుంచి ఏ రకమైన ఇబ్బంది ఉండదని స్పష్టం చేశారు. ఎటొచ్చి సొంత పార్టీ నేతలతో మాత్రం ఆయన చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అంతకుముందు కడియం శ్రీహరి బడ్జెట్ గురించి మాట్లాడుతూ, గతేడాది ద్రవ్యలోటు రూ.33 వేల కోట్లుగా ఉందని, కానీ ఈసారి బడ్జెట్‌లో ద్రవ్యలోటు భారీగా కనబడుతోందని అన్నారు. 2 లక్షల ఉద్యోగాలు ఎలా భర్తీ చేస్తారో చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పూర్తి చేసిన నియామకాలు తమవిగా చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. కెసిఆర్ హయాంలో నోటిఫికేషన్ వేసి, పరీక్షలు నిర్వహించిన ఉద్యోగాలను తామే ఇచ్చినట్లు కొత్త ప్రభుత్వం చెబుతోందని దుయ్యబట్టారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం వల్ల తాము నియామక పత్రాలు ఇవ్వలేకపోయామని తెలిపారు. ప్రజల తీర్పుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, గత సర్కార్ ఇచ్చిన ఉద్యోగాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్నట్లు చెప్పుకోవడం ఏ మాత్రం బాగోలేదని చెప్పారు.- గత ప్రభుత్వం నాటి నోటిఫికేషన్లు కాకుండా కొత్తగా 2 లక్షల ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాస్తవాలకు దగ్గరగా బడ్జెట్ కుదించుకున్నామని, కాంగ్రెస్ హామీల అమలుకు రూ.2.75 లక్షల కోట్ల బడ్జెట్ ఏమాత్రం సరిపోయే పరిస్థితి లేదని తెలిపారు. దుబారాపై అధ్యయనం చేసి వాస్తవ బడ్జెట్ చేయాల్సి ఉందని పేర్కొన్నారు. దళితబంధు స్థానం అంబేద్కర్ అభయహస్తం పథకం కింద దళితులకు రూ.12 ఇస్తామని కాంగ్రెస్ పార్టీ చెప్పిందని, కానీ బడ్జెట్ ఆ పథకానికి నిధులు కేటాయించలేదని తెలిపారు. పెరిగిన ఎస్సి జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లను 18 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ పార్టీ చెప్పిందని, ఉద్యోగ నోటిఫికేషన్లు ఇచ్చే లోపల రిజర్వేషన్ల పెంపునకు చర్యలు తీసుకోవాలని కోరారు.

**నల్గొండ సభలో హోంగార్డు చనిపోతే ఆదుకోలేదు : మంత్రి కోమటిరెడ్డి**

కడియం శ్రీహరి వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. నిరుద్యోగులను గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం మోసగించినట్లు తామూ మోసగిస్తామనడం సరికాదని హితవు పలికారు. బిఆర్ఎస్ పార్టీది ప్రతిపక్షం కాదని, ఫ్రస్టేషన్ పక్షమని ఎద్దేవా చేశారు. నల్గొండలో బిఆర్ఎస్ సభ పెట్టినప్పుడు హోంగార్డు చనిపోతే కెసిఆర్, కెటిఆర్ బాధిత కుటుంబాన్ని ఆదుకోలేదని మండిపడ్డారు. తెలంగాణ వచ్చాక మొదటి ముఖ్యమంత్రి దళితుడే అని కెసిఆర్ చెప్పారని గుర్తు చేశారు. దళితుడిని సిఎం చేయకపోతే తన తల తీసుకుంటానని కెసిఆర్ అన్నారని, అసలు ఆ హామీ ఏమైందని ప్రశ్నించారు. భట్టి విక్రమార్క ప్రతిపక్ష నేత అయితే కెసిఆర్ భరించలేకపోయారని పేర్కొన్నారు. తాము కొత్తగా ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేదని, కానీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ఉద్యోగాలకు సంబంధించి న్యాయ వివాదాలు పరిష్కరించి ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. కొత్తగా టిఎస్‌పిఎస్‌సి కమిషన్‌ను నియమించామని, కమిషన్‌ను ప్రక్షాళన చేసి అదనపు సిబ్బందిని ఇచ్చామని తెలిపారు. టిఎస్‌పిఎస్‌సికి ఇప్పటికే రూ.40 కోట్లు మంజూరు చేశామని, ఉద్యోగాల నోటిఫికేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని అన్నారు. పదేళ్లుగా ఉద్యోగాల కోసం యువత ఎదురుచూశారని, యువత కలల సాకారం కోసం ప్రభుత్వం కృషిచేస్తుందని చెప్పారు.

# తెలంగాణ చిహ్నంలో రాచరికపు ఆనవాళ్లు ఏమున్నయ్..?

### - మండలిలో ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చిహ్నంలో రాచరికపు ఆనవాళ్లు ఏమున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు. శాసన మండలిలో గురువారం తెలంగాణ అధికార చిహ్నం, తెలంగాణ తల్లి విగ్రహం మార్పుపై గురువారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ కాకతీయ తోరణంలో ఏం రాచరికపు ఆనవాళ్లు ఉన్నాయని ప్రభుత్వాన్ని నిలదీశారు. భూమి, నీటిని తల్లితో పోలుస్తాం.. అదే విధంగా తెలంగాణ ఉద్యమంలో ఓ ప్రొఫెసర్ తెలంగాణ తల్లి ప్రతిమను రూపొందించారని తెలిపారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూస్తే ఓ సామాజికవర్గ దొరసాని గుర్తుకు వస్తుందని ప్రభుత్వ పెద్దలు చెప్పడం సమంజసం కాదన్నారు. మంత్రి శ్రీధర్ సమాధానమిస్తూ కాకతీయ తోరణం, తెలంగాణ తల్లి విగ్రహం విషయంలో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని మార్పులు చేర్పులు ఉంటాయన్నారు. రాష్ట్ర ప్రజల సెంటిమెంట్‌ను గౌరవిస్తామన్నారు. కాకతీయులు, మొగల్ సామ్రాజ్యంలో మంచి, చెడు రెండు జరిగాయని.. చెడు మరోసారి జరుగకుండా చూస్తామన్నారు. ప్రభుత్వమే విగ్రహం తయారు చేయదని.. అన్ని వర్గాల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సింగిల్‌గా నిర్ణయం తీసుకోమన్నారు. విగ్రహం, చిహ్నం తయారీలో బీఆర్ఎస్ నేతల సలహాలు తీసుకుంటామని చెప్పుకొచ్చారు. కాకతీయ రాజులు తెలంగాణ సమాజానికి ఎంతో మంచి పనులు చేశారు. నిజాం రాజులు హైదరాబాద్ అభివృద్ధిలో చెరగని ముద్ర వేశారని దేశపతి శ్రీనివాస్ చెప్పుకొచ్చారు. రాజీవ్ గాంధీ దేశం కోసం చేసిన సేవలపై గౌరవం ఉందని దేశపతి అన్నారు. జాతీయ నాయకుల పేర్లు అనేక వాటికీ పెట్టుకున్నామని.. ఇప్పటికే ఎయిర్‌పోర్ట్‌కి పెట్టుకున్నామని.. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాల్సిన చోట రాజీవ్ విగ్రహం పెట్టడం సరికాదన్నారు.

# మాంద్యం కోరల్లో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ



న్యూఢిల్లీ: ఈ ఏడాది చివరిలో ఎన్నికలకు ముందు బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. 2023 ద్వితీయార్థంలో బ్రిటన్ మాంద్యంలో కూరుకుపోయింది. డిసెంబర్ క్వార్టర్‌లో బ్రిటన్ జీడీపీ అంచనాల కంటే దారుణంగా 0.3 శాతం తగ్గింది. ఇక జులై, సెప్టెంబర్ మధ్య బ్రిటన్ ఎకానమీ 0.1 శాతం పడిపోయింది. వాస్తవ జీడీపీలో వరుసగా రెండు క్వార్టర్స్‌లో ప్రతికూల వృద్ధి నమోదైతే సాంకేతిక మాంద్యంగా నిర్వచిస్తారు. బ్రిటిష్ ఎకానమీ మలుపు తిరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని, తాము ప్రణాళికకు కట్టుబడి ముందుకు సాగాలని, బలమైన ఆర్థిక వ్యవస్థ కోసం తాము కార్యకలాపాలు, వ్యాపారాలపై పన్నులు తగ్గించాలని బ్రిటన్ ఆర్థిక మంత్రి జెరెమి హంట్ పేర్కొనడం గమనార్హం. ఇక బడ్జెట్‌లో ఎన్నికలకు ముందు పన్ను తగ్గింపుల కోసం ప్రభుత్వ వ్యయాల్లో హంట్ భారీ కోత విధించనున్నారు. ఇక 2022తో పోలిస్తే 2023లో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ కేవలం 0.1 శాతం వృద్ధి కనబరిచిందని జాతీయ గణాంక కార్యాలయం (ఓఎన్ఎస్) పేర్కొంది. 2024లో ఇది పుంజుకుంటుందనే అంచనాలు ఉన్నా కేవలం 0.25 శాతానికి పరిమితమవుతుందని బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ అంచనా వేసింది. బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ దాదాపు రెండు సంవత్సరాలుగా స్తబ్దుగా ఉన్నా ఎకానమీ విస్తృతి, పరిణతి దృష్ట్యా బ్రిటన్ మాంద్యం కోరల్లో చిక్కుకోవడం అరుదు. అలాంటిది తాజా సంకేతాలు బ్రిటన్ ఎకానమీని కలవరపరుస్తున్నాయి. 2008, 2009లో ప్రపంచ ఆర్థిక మాంద్యంతో బ్రిటన్ ఎకానమీ దెబ్బతిన్నా ఆ తర్వాత పుంజుకుంది. ఇక కొవిడ్-19తో బ్రిటన్ ఆర్థిక వ్యవస్థ 2020 ప్రథమార్థంలో తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని ఎదుర్కొంది.


# 17న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు : తలసాని




హైదరాబాద్: ఈ నెల 17న బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ చైర్మన్ వాసుదేవరెడ్డితో కలిసి తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఘనంగా జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఆలయాలు, మసీదులో, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు జరిగేలా ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. వికలాంగులకు వీల్‌చైర్స్ పంపిణీ, ఆటో డ్రైవర్లకు ఇన్సురెన్స్ పత్రాల పంపిణీ, పేషేంట్స్ పండ్ల పంపిణీ తదితర సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

## దేశంలో రైతులు ప్రశ్నించే...

# హక్కును కోల్పోయారు



హైదరాబాద్: దేశంలో రైతులకు ప్రశ్నించే హక్కు కూడా లేకుండా ప్రధాని మోడీ చేశారని కాంగ్రెస్ అగ్రనేత దిగ్విజయ్ సింగ్ అన్నారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్లకే కొమ్ము కాస్తోందని ఆయన మండిపడ్డారు. అంబానీ, అదానీ లాంటి కుబేరులకు మేలు చేసేలా కేంద్రం నిర్ణయాలు తీసుకుంటోందని ఆయన దుయ్యబట్టారు. దేశ రాజధాని సరిహద్దుల్లో తమ హక్కుల కోసం రైతులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని కాంగ్రెస్ తరపున తాము డిమాండ్ చేస్తున్నామని ఆయన తెలిపారు. దివంగత శ్రీమతి స్వామినాథన్ సిఫార్సులను బిజెపి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తన రాయ్‌పూర్ సమావేశంలో వ్యవసాయంపై తన తీర్మానంలో ఎంఎస్‌పికి చట్టపరమైన హామీని అందజేస్తామని హామీనిచ్చామన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల తర్వాత అధికారం చేపట్టగానే భారత ప్రభుత్వం మొదటి, ప్రధాన ఎజెండా ఇదే అవుతుందని కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ సమాజానికి హామీ ఇస్తుందన్నారు.

**రెండేళ్లు గడిచినా ప్రధాని పట్టించుకోలేదు**

2014 సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రచారం చేస్తున్నప్పుడు, బిజెపి ప్రధాన మంత్రి అభ్యర్థి స్వయంగా ఎంఎస్‌పిని అందజేస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని ఆయన తెలిపారు. రెండేళ్ల క్రితం ఢిల్లీ శివార్లలో దేశ రైతులు దాదాపు ఒక సంవత్సరం పాటు నిరసన ధర్నా నిర్వహించినప్పుడు, ఎంఎస్‌పికి చట్టపరమైన హామీని పరిశీలిస్తామని ప్రధాని హామీ ఇచ్చారని, రెండేళ్లు గడిచినా ఏమీ జరగలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే రైతులు, మిస్టర్ మోడీ వాగ్దానాన్ని గుర్తు చేయడానికి, దేశ రాజధాని వైపు వెళ్లాలని నిర్ణయించుకున్నారన్నారు. కానీ, వారు దేశ రాజధాని వైపు వెళ్లకుండా అడ్డుకుంటున్నారన్నారు. హర్యానా రాష్ట్ర పోలీసులు రైతుల కవాతును నిరోధించడానికి క్రూరమైన, అమానవీయ మార్గాలను ఆశ్రయిస్తున్నారన్న భయంకరమైన దృశ్యాలను దేశం మొత్తం చూసిందన్నారు. పంజాబ్, హర్యానాలో పెట్రోల్ పంపులు ఎండిపోయాయని, అక్కడి బంక్‌లకు పెట్రోల్ సరఫరా నిలిపివేశారని ఆయన తెలిపారు.

**10 ఏళ్లయినా విదేశీ బ్యాంకుల్లో నల్లధనం వెనక్కి**

విదేశీ బ్యాంకుల్లో ఉన్న మొత్తం నల్లధనాన్ని తిరిగి తీసుకువస్తానని, దానికి కాంగ్రెస్‌ను నిందించారని, ప్రతి భారతీయ బ్యాంకు ఖాతాలో ఒక్కొక్కరికి రూ.15 లక్షలు డిపాజిట్ చేస్తానని మోడీ చెప్పారని ఆ మాట కూడా ఇప్పటివరకు అమలు కాలేదని ఆయన ఆరోపించారు. అధికారాన్ని స్వీకరించిన తర్వాత అతను ప్రతి భారతీయుడు 'జీరో-బ్యాలెన్స్' బ్యాంక్ ఖాతాను తెరవమని ప్రచారాన్ని చేసి పదేళ్లు గడిచాయని, ఇప్పటివరకు బ్యాంకు బదిలీలు జరగలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు సృష్టిస్తానని మోడీ చెప్పారని ఆ లెక్కన దేశంలోని యువతకు ఇరవై కోట్ల ఉద్యోగాలు కల్పించాలని ఆయన ఎద్దేవా చేశారు. కానీ, దేశంలో నిరుద్యోగం రేటు గత 45 ఏళ్ల కన్నా అత్యధికంగా నమోదయ్యిందన్నారు. దేశంలో గ్యాస్ సిలిండర్ ధరలు రెండింతలు పెరిగాయన్నారు. పదేళ్లలో దేశ అప్పులు 2014లో దాదాపు రూ.55 లక్షల కోట్ల నుంచి ఇప్పుడు రూ.185 లక్షల కోట్లకు మూడు రెట్లు పెరిగాయన్నారు.

# ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ విరుద్ధం..

### - బాండ్ల వివరాలివ్వాలని ఎస్‌బీఐకి సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ: ఎలక్టోరల్ బాండ్ల పై ఇవాళ సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. సీజేఐ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఆ తీర్పును ఇచ్చింది. కేంద్ర సర్కారు ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్‌కు చట్టబద్ధత ఉంటుందా లేదా అన్న పిటీషన్లపై కోర్టు తీర్పును వెలువరించింది. బ్లాక్ మనీ సమస్యను పరిష్కరించేందుకు పోల్ బాండ్స్ స్కీమ్ ఒక్కటే పరిష్కారం కాదు అని కోర్టు పేర్కొన్నది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, బీఆర్ గవాయి, జేబీ పర్దివాలా, మనోజ్ మిశ్రాలు ఆ ధర్మాసనంలో ఉన్నారు. ఎన్నికల బాండ్లపై ఏకగ్రీవ తీర్పు ఇవ్వనున్నట్లు సీజేఐ వెల్లడించారు. ధర్మాసనంలోని సభ్యుల మధ్య రెండు అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. జస్టిస్ సంజీవ్ ఖన్నాతో పాటు తాను కూడా ఒకే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు సీజేఐ తెలిపారు. సరైన ఓటింగ్ ప్రక్రియను తెలుసుకునేందుకు రాజకీయ నిధుల గురించి సమాచారం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని సీజేఐ అన్నారు. ఆర్టికల్ 19(ఏ)(ఏ) ప్రకారం సమాచార హక్కును ఉల్లంఘించినట్లు అవుతుంది. ఎలక్టోరల్ బాండ్ల స్కీమ్ రాజ్యాంగ వ్యతిరేకమని సీజేఐ చంద్రచూడ్ తెలిపారు. ఆర్పీఏ, ఐటీ చట్టంలో 29(1)సెక్షన్ సవరణ రాజ్యాంగ వ్యతిరేకం అవుతుందన్నారు. ఎలక్టోరల్ బాండ్లను జారీ చేసే బ్యాంకులు తక్షణమే బాండ్లను నిలిపివేయాలని కోర్టు తన తీర్పులో తెలిపింది. నిధులు అందుకున్న రాజకీయ పార్టీలు వివరాలను ఎస్‌బీఐ బ్యాంకు వెల్లడించాలని కోర్టు కోరింది. మార్చి 6వ తేదీలోగా ఎన్నికల సంఘానికి ఆ వివరాలను ఇవ్వాల్సి ఉంటుంది. ప్రతి బాండ్‌కు చెందిన వివరాలను ఎస్బీఐ వెల్లడించాలి. మార్చి 13వ తేదీ వరకు తమ అధికారిక వెబ్‌సైట్ ఎన్నికల సంఘం ఆ సమాచారాన్ని పోస్టు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ ఎన్నికల బాండ్లను రాజకీయ పార్టీలు ఖాతాలో జమా చేయకుంటే, వాటిని రిటర్న్ చేయాలని కోర్టు ఆదేశాలు ఇచ్చింది.

# పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి అత్యధిక స్థానాల్లో గెలుస్తుంది



హైదరాబాద్ : రాష్ట్రంలో త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికలలో బిజెపి అత్యధిక స్థానాలు గెలిచి కేంద్రంలో మరోసారి మోదీ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని కేంద్ర మంత్రి, ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం సికింద్రాబాద్ బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు పిఎల్. శ్రీనివాస్ పలువురు ఇతర పార్టీలకు చెందిన నాయకులు బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిఎల్ శ్రీనివాస్ లాంటి అనుభవజ్ఞులైన నాయకుల సేవలను తమ పార్టీ వినియోగించుకుంటుందని పేర్కొన్నారు. దేశంలో నీతివంతమైన, శక్తివంతమైన ప్రభుత్వంగా మరోసారి నరేంద్ర మోడీని ప్రధాని చేయాలనే కాంక్ష దేశ ప్రజల్లో బలంగా ఉందన్నారు. రాష్ట్రంలో తాజా, మాజీ ప్రభుత్వాల వైఖరి ప్రజలకు నష్టం కలిగించే విధంగా ఉందని ఆరోపించారు. దేశంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించిన ఘనత ప్రధాని మోడీకే దక్కుతుందని వెల్లడించారు. అదే విధంగా ఉదయం బిజెపి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి కార్యక్రమంలో పాల్గొని బ్రిటీష్ మత మార్పిడులకు వ్యతిరేకంగా సంత్ సేవాలాల్ పోరాటం చేశారని కిషన్ రెడ్డి కొనియాడారు. సాంఘీక దురాచారాలను రూపుమాపేందుకు అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. నేటి యువత సంత్ సేవాలాల్ చూపిన బాటలో నడవాలని పిలుపునిచ్చారు. బంజారా సమాజం హక్కులు, ఆర్థిక స్వావలంబన కోసం బిజెపి పని చేస్తుందని తెలిపారు. ఆదివాసీ గ్రామాల్లో అభివృద్ధి కోసం కార్యాచరణ రూపొందించామని, బంజారా సమాజం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామని వెల్లడించారు.

# ఎన్నికల బాండ్ల స్వీకరణలో బిజెపి టాప్

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్ల పథకాన్ని నిలిపివేస్తూ సుప్రీంకోర్టు గురువారంచలన తీర్పును వెలువరించిన నేపథ్యంలో ఈ పథకం వల్ల అత్యధికంగా లబ్ధి పొందిన భారతీయ జనతా పార్టీకి సుప్రీంకోర్టు తాజీ తీర్పుతో గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది. 2018లో ప్రారంభమైన ఈ పథకం ద్వారా 2023 వరకు మొత్తం రూ. 13,008 కోట్ల ఎన్నికల బాండ్లను 25 విడతలుగా విక్రయించారు. సమాచార హక్కు కార్యకర్త లోకేష్ బాత్ర సేకరించిన వివరాలు ప్రకారం..2023 ఏప్రిల్ నుంచి 2024 జనవరి మధ్య మరో ఐదు విడతలుగా రూ. 4509 కోట్ల విలువైన ఎన్నికల బాండ్ల విక్రయాలు జరిగాయి. అయితే ఏ పార్టీ ఎంత మొత్తంలో బాండ్లు అందుకున్నదీ అన్న వివరాలు ఇంకా బహిర్గతం కాలేదు. 2017 ఏప్రిల్ నుంచి 2023 మార్చి మధ కాలంలో బిజెపి రూ. 6570 కోట్ల బాండ్లను అందుకుంది. ఆ కాలంలో విక్రయించిన మొత్తం బాండ్లలో 54 శాతం ఒక్క బిజెపికే దక్కాయి. కాంగ్రెస్ పార్టీకి 9 శాతం అంటే రూ. 1123 కోట్లు అందగా. మమతా బెనర్జీకి చెందిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి రూ. 1092 కోట్లు



ఎన్నికల బాండ్ల రూపంలో సమకూరాయి.

Printed, Published and owned by **VISHWANATH V**, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : **VISHWANATH V**, **RNI Regd. No. TELTEL/2023/86207**, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com